


స్వర్ణాల చెరువుకు గంగా హారతులు ఇస్తున్న వేద పండితులు

దీపం జ్యోతి పరం బ్రహ్మ
దీపం జ్యోతి పరాయణ
దీపేన సాధ్యతే సర్వం
దీప ద్యేవ నమో నమః

'ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభోశంకర... శంభో శివశంభో...' అంటూ భక్తుల నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగిపోయాయి. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివ, కేశవుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా దివ్యక్షేత్రాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కార్తీక దీపారాధనలు, కృతికా దీపం దర్శనం, ప్రాకారోత్సవాలు జరిగాయి. శివాలయాల్లో రాత్రి జ్వాలాతోరణం, లంకా దహన కార్యక్రమాలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో తిరుమంజన సేవలు, తులసీదళ అర్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. కోనలు, కడలి తీరంలో భక్తులు తరలివచ్చి సముద్ర స్నానాలు ఆచరించి, సైకత శిల్పాలకు పూజలు చేశారు.



హరహర మహాదేవ!

- వైభవోపేతంగా కార్తీక పౌర్ణమి
- శివ, కేశవ ఆలయాల్లో విశేష పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం



కడలితీరానికి పోటెత్తిన భక్తులు

కావలి, (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సముద్ర తీరానికి భక్తులు పోటెత్తారు. కావలి మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీర ప్రాంతాలలోని తీరానికి తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. సముద్రంలో స్నానాలు చేసి, సైకత శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఐదుగురు గజ ఈతగాళ్లను, పడవలను పోలీసులు అధికారులు ఏర్పాటు చేశారు. కావలి డీఎస్పీ పీ.శ్రీధర్, రూరల్ సీఐ రాజేశ్వర రావు, ఎస్ఐ తిరుమలరెడ్డి, మెరైన్ ఎస్ఐ జానకిరామిరెడ్డిలు తమ సిబ్బందితో తీరంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. విడవలూరు, ఇందుకూరుపేట, ఉలవపాడు, ముత్తుకూరు తీరప్రాంతాలకూ భక్తులు తరలివచ్చారు.

పెంచలకోనలో..

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో శ్రీవార్లకు ఏకోత్తర సహస్ర కలశాభిషేకం, విశేష హోమాలు, పూజలు, స్నపన తిరుమంజనం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. 1001 కలశాలు ఏర్పాటు చేసి శ్రీవార్ల సుదర్శన ఆళ్వార్, సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. నందనవనంలో ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. తనకు ఇష్ట వాహనమైన స్వర్ణ గరుడుడిపై పెంచలస్వామి కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.


కోనలో ఏకోత్తర సహస్ర కలశాభిషేకంలో అర్చకులు

నాడు అధికార బలంతో ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు వేసిన స్కెచ్ బట్టబయలైంది. ఇరిగేషన్ అధికారుల సహకారంతో వేసిన ప్లాన్ వికటించింది. ప్రభుత్వం మారడంతో పెన్నా డెల్టా ఆధునికీకరణ పనుల బిల్లుల్లో జరిగిన మతలబు వెలుగులోకి వచ్చింది. సుమారు ఐదు నెలలపాటు సాగిన విజిలెన్స్ విచారణ పూర్తవగా, పెన్నా ప్యాకేజీ-1 పనుల్లో అక్రమాలు నిజమేనని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సుమారు రూ.3.50 కోట్లు ప్రజాధనాన్ని ట్యాంపరింగ్ సర్టిఫికెట్లతో కొట్టేదామనుకున్నారని ఆ విచారణలో తేటతెల్లమైంది. ఈ విచారణ నివేదికను తాజాగా ప్రభుత్వానికి పంపారు. ఈ నివేదిక ఇప్పుడు ఓ వైసీపీ ముఖ్య నేత మెడకు ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. ఈ ముఖ్యనేతే ప్యాకేజీ-1 పనుల కాంట్రాక్టర్ కావడం గమనార్హం. సదరు నేతతోపాటు ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు సహకరించిన ఇరిగేషన్ అధికారులపైనా క్రిమినల్ కేసుల నమోదుకు విజిలెన్స్ సిఫర్సు చేసినట్లు సమాచారం.

అక్రమాలు నిజమే!

- విజిలెన్స్ విచారణలో 'ప్యాకేజీ-1'లో బయటపడ్డ స్కాం
- ప్రభుత్వానికి నివేదిక అందజేత
- సుమారు రూ.3.50 కోట్లు కొట్టేసేందుకు ప్లాన్
- సహకరించిన ఇరిగేషన్ అధికారులు
- బాధ్యులపై క్రిమినల్ చర్యలకు సిఫారసు
- వైసీపీ ముఖ్యనేత మెడకు ఉచ్చు

నెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09 సంవత్సరంలో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు అనుకున్న విధంగా పూర్తి కాలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ వెంటనే ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లులను గతేడాది ఎన్నికల కోడ్‌కు ముందు హడావిడిగా సీఎఫ్‌ఎంఎస్‌లోకి ఎక్కించారు. సాధారణంగా పే అండ్ అకౌంట్స్ అధికారుల లాగిన్లలో అంత సామాన్యంగా బిల్లులు ముందుకు కదలవు. కానీ ఈ బిల్లు మాత్రం గంటల వ్యవధిలో పరుగులు పెట్టడం గమనార్హం. అయితే ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఫైనల్ బిల్లు మంజూరు కాలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో అసలు కథ బయటకొచ్చింది. ముందు తప్పులు చేసేసిన అధికారులు.. ప్రభుత్వం మారిన వెంటనే సీఎఫ్‌ఎంఎస్ నుంచి సాంకేతిక కారణాల పేరుతో బిల్లును వెనక్కు తీసుకున్నారు. ఇలా ఎందుకు చేశారా..? అని ఆరా తీసిన 'ఆంధ్రజ్యోతి'.. అసలు విషయాన్ని వెలుగులోకి తెచ్చింది.



● క్రిమినల్ చర్యలకు సిఫార్సు?

ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ఫైనల్ బిల్లుకు సంబంధించిన క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌లో కొట్టివేతలు ఉన్నాయి. తొలుత రూ.14.67 కోట్లకు క్యూసీ సర్టిఫికెట్ ఇష్యూ చేశారు. దానిని కొట్టివేసి ఆ స్థానంలో రూ.18.79 కోట్లు రాశారు. అంటే రూ.4.12 కోట్లు పెంచారన్నమాట. నిబంధనల ప్రకారం క్యూసీ సర్టిఫికెట్‌పై ఎటువంటి కొట్టివేతలు ఉండకూడదు. అందులోనూ ఈ కొట్టి వేత కూడా 13 నెలల తర్వాత జరగడం ఆ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది. ఇక ప్రీక్లోజ్ చేశాక వర్కు అంచనాలు రివైజ్ చేయడం కూడా వివాదాస్పదంగా మారింది. వీటన్నింటినీ 'ఆంధ్రజ్యోతి' కథనాల రూపంలో వెలుగులోకి తీసుకురావడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అదే సమయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా ప్యాకేజీ-1పై విచారణ జరపాలని ప్రభుత్వానికి లేఖ రాయడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణ ఇటీవల పూర్తయింది. నాటి రికార్డులన్నింటినీ పరిశీలించి, అప్పటి అధికారులు, ఉద్యోగులను విచారించారు. ఈ క్రమంలో చేసిన పనులకు మించి బిల్లులు తీసుకునేందుకు కుట్రలు జరిగాయని నిర్ధారించారు. ఇందుకు బాధ్యులుగా ఐదుగురు అధికారులపై అభియోగాలు నమోదు చేశారు. ఇందుకు బాధ్యులైన వారందరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతోపాటు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని విజిలెన్స్ అధికారులు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

లేదంటే నిబంధనల సాకుతో పెండింగ్
రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెచ్చుమీరిన అవినీతి
సాంకేతికను తీసుకొచ్చినా.. ఆగని అక్రమాలు
ఏసీబీ దాడులు చేస్తున్నా బేఖాతర్!

'అడిగినంత ఇస్తే ఓకే.. లేదా ఆ ఫైల్ కదలదు. లేనిపోని క్వెరీలు వేసి పెండింగ్ పెట్టేస్తారు. మరీ ఎక్కువైతే.. నిబంధనలు సాకు చూపి ఫైల్‌ను వెనక్కి ఇచ్చేస్తారు.' జిల్లావ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న తీరిది. సదరు కార్యాలయాల్లో అవినీతిని అంతమొందించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చినా ఫైళ్ల కింద నోట్లు మాత్రం ఉండాల్సిందే. సొంతంగా దస్తావేజులు రాసుకొని రిజిస్ట్రేషన్ చేసుకొనే వెసులుబాటు ఉన్నా, దస్తావేజులను ఏమాత్రం కష్టపడకుండా పూరించేలా, నమూనా దస్తావేజును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినా అక్రమాలకు మాత్రం తెరపడలేదు. అవినీతి అంతమొందిచేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు చేస్తున్నా మేమింతే.. మారమంతే అన్నట్టుగా కొంతమంది సబ్ రిజిస్ట్రార్లు వ్యవహరిస్తున్నారు.

పైసలిస్తేనే ఫైలు కదిలేది!

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు ఎక్కువ జరుగుతుంటాయి. తనఖా రిజిస్ట్రేషన్లు కూడా నిర్వహిస్తుంటారు. వీటితోపాటు మార్కెట్ విలువల సర్టిఫికెట్లు, ఈసీలు ఇస్తుంటారు. వీటిలో ఒక్కొక్క పనికీ ఒక్కోరేటును నిర్ణయించి, లంచాలు వసూలు చేస్తున్నారని సమాచారం. మొత్తం రిజిస్ట్రేషన్ ఫీజు విలువలో ఒక శాతం నుంచి 2 శాతం లంచాలుగా అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఆస్తికి వివరాలు తెలుసుకునే ఈసీలకు సైతం డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈసీకి రూ.300లకుగాను రూ.500 వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

● అధికారిణుల తీరుపై విమర్శలు

జిల్లాలోని మహిళా సబ్‌రిజిస్ట్రార్లలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ప్రజలు ఏకంగా రూరల్ ఎమ్మెల్యేకి, రూరల్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులకు పిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరు, నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, ముత్తుకూరు, ఇందుకూరుపేట కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లను తన కార్యాలయానికి పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. అవినీతికి తావులేకుండా పేదలకు సేవలందించాలని వారిని ఆదేశించారు.

● దళారుల రాజ్యం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు దళారులు రాజ్యమేలుతున్నారు. డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థ లేకపోయినా, చాలామంది డాక్యుమెంట్ రైటర్లమని చెప్పుకొంటూ కార్యాలయాల్లోనే తిష్ఠ వేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేస్తూ దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. అయినా వారు తమ దందాను కొనసాగిస్తున్నారు.


స్టోన్‌హౌస్‌పేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందం

● స్టోన్‌హౌస్‌పేట కార్యాలయంపై ఏసీబీ దాడి

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏబీసీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా అధికారుల బృందం సోదాలు నిర్వహించింది. ఏసీబీ అధికారుల రాకతో కార్యాలయంలో ఉన్న దళారులు, సిబ్బంది పరుగులు తీశారు. కార్యాలయంలో పనిచేసే ఓ మహిళా సబ్‌రిజిస్ట్రార్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సబ్‌రిజిస్ట్రార్‌ను, అందుబాటులో ఉన్న సిబ్బందిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. దస్త్రాలను పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. కొంత నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా గురువారం కూడా ఈ కార్యాలయంలో సోదాలు జరగనున్నట్లు సమాచారం. ఈ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌ను, సిబ్బందిని ప్రశ్నించిన అధికారులు, వివరాలను వెల్లడించలేదు. ఏసీబీ దాడుల వార్త జిల్లావ్యాప్తంగా తెలిసిపోవటంతో అన్నీ సబ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది అప్రమత్తమయ్యారు. తమ కార్యాలయాల్లో కూడా ఏ క్షణంలోనైనా దాడులు జరుగుతాయని తెలిసి, కొందరు ముందుగానే కార్యాలయాలను వదిలి వెళ్లినట్లు తెలిసింది.

నేడు దగదర్తికి మంత్రులు
నారా లోకేష్, ఫరూక్‌ల రాక

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దివంగత మాలేపాటి సుబ్బానాయుడి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఉదయం దగదర్తికి రానున్నారు. ఉదయం 6గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి లోకేష్ బయలు దేరి 9.30 గంటలకు దగదర్తికి చేరుకుంటారన్నారు. దివంగత సుబ్బానాయుడు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పలకరిస్తారు. అనంతరం 11 గంటలకు బయలుదేరి అమరావతిలోని సచివాలయానికి చేరుకుంటారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం రాత్రి నెల్లూరుకు చేరుకుని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బస చేశారు. గురువారం ఉదయం ఉదయం 8 గంటలకు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆ తర్వాత ఉదయం 9.30 గంటలకు దగదర్తికి చేరుకుని మంత్రి నారా లోకేష్‌తో కలిసి మాలేపాటి కుటుంబసభ్యులను పరామర్శిస్తారని పేర్కొన్నారు.

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతం నుంచి 16,124 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 70.388 టీఎంసీలు నిల్వ ఉంది.

ఆమె ఎవరు!?

- అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం
- మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపి

- 4లో..



ఇక విద్యాసంస్థల వాహనాల వంతు

- ఈనెల 10 నుంచి ఆర్టీవో తనిఖీలు

నిబంధనలు అమలు చేయకుంటే కఠిన చర్యలు

- వివరాలు 6లో..

క్రీడాపోటీలకు మనుబోలు రెవెన్యూ అధికారులు

మనుబోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీనుంచి జరగనున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలకు మండలం నుంచి రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌లు ఈ క్రీడలలో పాల్గొంటారు. తహసీల్దార్ కబడ్డీ, త్రోబాల్ పోటీలలో ప్రతిభ చూపనున్నారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ మరికొన్ని క్రీడాపోటీలలో పాల్గొననున్నారు. కాగా రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలలో పాల్గొంటున్న వీరికి పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11486
వెండి కిలో ధర	రూ. 149800
వెండి ఒక గ్రాము	రూ. 154.80

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు రెడ్డి దంపతులు

రాపూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోనలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పొదలకూరుకు చెందిన కె. శ్రీనివాసులు రెడ్డి, సుప్రజ దంపతులు బుధవారం రూ.1 లక్షా 116 విరాళాన్ని అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మాదిగ అవగాహన సదస్సు జయప్రదం చేయండి

మండలంలోని వీరాయపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య మాదిగ మాట్లాడుతూ నవంబరు 10న రాపూరు పట్టణంలోని జరిగే మాదిగల రాజకీయ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా గంపాల సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు గంపాల వెంకటయ్య తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గంపాల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

మనుబోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో 420 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏవో వెంకటకృష్ణయ్య తెలిపారు. మనుబోలు పీఏసీఎస్ వద్ద బుధవారం రైతులకు పీఏసీఎస్ చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య యూరియా బస్తాలు, కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సొసైటీకి 20టన్నులు, గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాలలో 400మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. అందుబాటులో ఉన్న యూరియాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు సాని వెంకటరమణయ్య, ఉడతా విజయ్‌కుమార్, సీఈవో మహేష్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోకి సన్మానం

మండలానికి కొత్త డిప్యూటీ ఎంపీడీవోగా జి. శ్రీనివాసరావు బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మనుబోలు డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న నారాయణ పదోన్నతిపై తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం ఎంపీడీవోగా రెండు నెలల క్రితం వెళ్లారు. పల్నాడు జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావును పదోన్నతిపై ప్రభుత్వం మనుబోలు డిప్యూటీ ఎంపీడీవోగా నియమించింది. పంచాయతీ కార్యదర్శులు కొత్త డిప్యూటీ ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు.

జనతా వారధి పేరుతో సమస్యల పరిష్కారం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనతా వారధి పేరుతో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే విధంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పని చేస్తారని బుచ్చి అర్బన్ ఇన్‌చార్జ్ మారుబోయిన శ్రీనివాసులు తెలిపారు. బుచ్చిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రవాస యోజన కార్యక్రమంపై జరిగిన సమావేశంలో అర్బన్ ఇన్‌చార్జ్ ముఖ్య అతిథిగా పాల్గొని మండల కమిటీ, బూత్ కమిటీలు, శక్తి కేంద్రం ప్రముఖుల గురించి చర్చించారు. అర్బన్‌లో ఇంటింటికీ స్వదేశీ కార్యక్రమ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యుడు రామిశెట్టి మోహన్, సీనియర్ నాయకులు కొప్పోలు మస్తానయ్య, ప్రవీణ్, నరసింహులు, లక్ష్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

బిరదవోలులో ఆత్మ నిర్భర్ భారత్

పొదలకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిరదవోలు గ్రామ పంచాయతీ పరిధిలో ముత్యాలపేట, కళ్యాణపురం, బ్రాహ్మణపల్లి, ఆత్మనిర్భర్ భారత్, సంకల్ప అభియాన్, ఇంట స్వదేశీ ఇంటింటా స్వదేశీ కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు ఆర్ ధనుంజయరావు, ఉపాధ్యక్షుడు చాప్పా వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి అక్కెం జనార్ధన్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సిరిగిరి ఓబులేసు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బీ గురుస్వామి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ఎం కిష్టయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జడ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు చింత గింజల సుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ముక్కు రామయ్య, మండల కార్యవర్గ సభ్యుడు రావుల అంకయ్య పాల్గొన్నారు.

తేగలు.. ఆరోగ్య దీపికలు!

ధర తక్కువ.. ఔషధ గుణాలు ఎక్కువ
ముందుగానే సీజన్ ప్రారంభం



కోవూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పూర్వీకులకే కాదు.. ఆధునికులందరి ఆరోగ్య ప్రదాయిని తేగ. శీతాకాలంలో వందల సంవత్సరాల నుంచి జిల్లా ప్రజానీకం ఎంతో ఆప్యాయంగా తినే శాఖాహారమిది. తాటి చెట్లు కనుమరుగవుతున్న ప్పటికీ డిసెంబరు, జనవరి నెలల్లో జిల్లాలో విస్తారంగా దొరికే తేగ. తాటి మొలకేనన్న విషయం చాలా మందికి తెలియదు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో దర్శనమిచ్చే తేగలు ఈ ఏడాది నవంబరు ప్రారంభం నుంచే కన్పిస్తున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ముందుగా తాటిపండ్లను నాటడంతో పక్వానికి వచ్చి నవంబరు నెల మొదటి వారానికే తేగలు అందుబాటులో వచ్చినట్లు పల్లెప్రజలు చెబుతున్నారు.

నగరాలకు ఎగుమతి...

కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డి పాళెం, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు మండలాల్లోని గ్రామాల నుంచి తేగల్ని చెన్నై, బెంగుళూరు లాంటి మహానగరాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ప్రతీ నిత్యం పలువురు మహిళలు ఈ ప్రాంతాల నుంచి తేగల్ని తీసుకువెళ్లి నెల్లూరు, గూడూరు, కావలి పట్టణాల్లో విక్రయిస్తుంటారు. తేగల్ని నిత్యం రైళ్లల్లో కూడా బుట్టల్లో తీసుకెళ్లి అమ్ముతున్నారు. నాలుగు తేగల ధర కేవలం రూ 20 మాత్రమే. తేగల ప్రయోజనాలను గుర్తించిన మన పూర్వీకులు తేగల ఉత్పత్తికి ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు తేగలు కొందరు కూలీలకు ఈ సీజన్‌లో ఉపాధి చూపుతున్నాయి.

రోగనిరోధక శక్తిని పెంచే అమృత ప్రదాయిని

అన్ని వయసుల వారిలో రోగ నిరోధకశక్తిని పెంచే లక్షణాలు తేగల్లో ఉన్నాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. తేగల్లో బీ1, బీ2, బీ3, సీ విటమిన్లు, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఒమేగా ఫ్యాటీయాసిడ్లు సమృద్ధిగా ఉన్నాయంటున్నారు. తేగలు తిన్న వెంటనే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగుల్లో చేరిన మలినాలు తొలగి పోతాయి. ఎముకలు, దంతాలు దృఢపడతాయని గ్రామీణుల విశ్వాసం. చలికాలంలో తేగలు తింటే రక్తహీనత సమస్య పరిష్కారమవుతుందనీ, తెల్ల రక్తకణాల సంఖ్య పెరుగుతుందనీ పోషకాహార నిపుణులు చెబుతున్నారు. తేగలు తింటే మెదడు కూడా చురుకుగా పని చేస్తుందని రు. ఎన్నో ప్రయోజనాలున్న తేగల్ని కోవూరు నియోజకవర్గ గ్రామాల్లోనే విస్తారంగా ఉత్పత్తి చేస్తారు. ఇంకెందుకు ఆలస్యం... తక్కువ ధరకు దొరికే తేగలను వీలైతే ఈ సీజన్ పొడవునా ఆరగించేయండి మరి!

సీఎం చంద్రబాబు స్ఫూర్తితో అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు గుమ్మళ్లదిబ్బ కాలనీలో బుధవారం ఆమె చేనేత కార్మికులకు తుఫాను సహాయక చర్యల్లో భాగంగా సరుకుల్ని పంపిణీ చేశారు. చేనేత, జౌళిశాఖ డీడీ సుబ్రహ్మణ్యం, ఏడీ వరప్రసాద్, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల రెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, టీడీపీ నాయకులు కొల్లా రెడ్డి సుధాకర రెడ్డి, ఇంతా మల్లా రెడ్డి, కోవూరు, వేగూరు సర్పంచులు యాకసిరి విజయ, కరేటి అమరావతి, మాజీ ఎంపీపీ యాకసిరి వెంకట రమణమ్మ, జొన్నవాడ దేవాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, చేనేత సంఘం నాయకులు కేవీ శేషయ్య, మధుసూదనరావు పాల్గొన్నారు.

ప్రతీ పంచాయతీ నుంచి ఆదర్శ రైతు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ అనిత

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో ప్రతీ పంచాయతీ నుంచి నూతన సాంకేతిక పద్ధతుల్లో వినూత్నంగా పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా ఉన్న ఒక రైతును ఎంపిక చేసినట్టు కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జీ అనిత తెలిపారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు కో-ఆపరేటివ్ రూరల్ సొసైటీ బ్యాంకులో ఛాంపియన్ రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగు ఖర్చులు తగ్గించి, దిగుబడి పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. వరిలో సాగు చేసుకోవాల్సిన రకాలు తదితర అంశాలపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త పరమశివ తెలియజేశారు. వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలుగా ఆయిల్ ఫామ్ సాగు చేపడితే వంద శాతం సబ్సిడీపై మొక్కలు ఇస్తామని ఉద్యానశాఖ అధికారి కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీహరి, సంఘం మండల వ్యవసాయాధికారి వి. శశిధర్, రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు చేయూత

పొదలకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను బాధితులకు సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని చేనేత కార్మికులకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు ఆధ్వర్యంలో తుపాను కారణంగా మగ్గం గుంటలోకి నీరు చేరి చేనేత చేయుటకు వీలులేని పరిస్థితి వున్న ఒక్కో కుటుంబానికి బియ్యం-50 కేజీలు, కందిపప్పు-1కేజీ, చక్కెర-1కేజీ, పామాయిల్ -1లీ, బంగాళాదుంపలు-1కేజీ, ఆనియన్స్-1కేజీ చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు రైతు సంఘం నాయకులు బక్కయ్య నాయుడు, వీఆర్‌ఓ నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా యూరియా పంపిణీ

విడవలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు రబీ సీజన్‌లో రైతులకు రాజకీయాలకు అతీతంగా యూరియాని పంపిణీ చేస్తున్నామని వరిణి సొసైటీ చైర్ పర్సన్ కొడిమేర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో సుధీర్, టీడీపీ నాయకులు వెల్లంపల్లి దిలీప్, తంగేళ్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: మండలంలోని మరుపూరులో 400 బస్తాల యూరియాను వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకుడు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి బుధవారం రైతులకు పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి హైజంప్ పోటీలకు ఎంపిక

రాపూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోనుపల్లి కరణామయి పాఠశాల పదవ తరగతి విద్యార్థి పామర్తి చైతన్య జిల్లా స్థాయి హై జంప్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మేనేజింగ్ డైరెక్టర్ పులిపాటి విజయ్ భరత్ విద్యార్థికి అభినందనలు తెలిపారు.

పాఠశాలలకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలి

కోవూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఇంటర్నేషనల్ హ్యూమాన్ రైట్స్ ఆర్గనైజేషన్, భారతీయ బహుజన సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సర్కిల్ పరిధిలో పలుచోట్ల మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నందువల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆయా సంఘాల నాయకులు జీ చిన్నారావు, కిషోర్, కళ్యాణ్, రవీంద్ర, రమణయ్య, జీవీ రమణయ్య తదితరులు వినతి పత్రం సమర్పించారు.

స్నేహితుడి తండ్రి కర్మక్రతువుల్లో ఉదయగిరి ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని గాంధీనగర్ సాయిబాబా గుడి ప్రాంతంలో తన స్నేహితుడు మన్నెం మధుసూధన్‌రెడ్డికి ఇటీవల పితృవియోగం కలగగా, బుధవారం జరిగిన కర్మక్రతువుల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఇటీవల బుచ్చిలో మన్నెం లక్ష్మీనరసారెడ్డి మృతి చెందిన విషయం విదితమే. కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేష్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరనీకుమా.. కార్తీక దీపం!

కనుల పండువగా కార్తీక పౌర్ణమి వేడుకలు



పొదలకూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాపూరు శివాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

పొదలకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయాలన్నీ ఆధ్యాత్మిక శోభతో శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి. ఆబాలగోపాలంతో దీపాలకాంతుల నడుమ భక్తుల సందడి నెలకొంది. పట్టణంలోని చోళులు కాలం నాటి పురాతన శివాలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పట్టణంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్తీక పౌర్ణమి నాటి దీప దానాన్ని అత్యంత పవిత్రంగా భావించాలని ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి తెలిపారు.

రాపూరు : శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నీటి వాగులో వదిలారు. కొండేరు, సిద్దేశ్వర కోన వద్ద మహిళలు తెల్లవారుజామునే నదీ స్నానం ఆచరించి, దీపాలను వదిలారు. రామేశ్వరాలయం, వలస బుగ్గేశ్వర కోన, పెనుబర్తి శివాలయం వద్ద ఉదయం నుండే పుణ్య స్నానాలు ఆచరించి క్యూలైన్లలో బారులు తీరారు. ఇటీవల కాశీ బుగ్గ వద్ద జరిగిన ప్రమాదం దృష్ట్యా రాపూరు పోలీసులు ప్రధాన ఆలయాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు సముద్ర తీరంలో కార్తీక శోభ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు, అయ్యప్ప మాలధారులు సముద్ర తీరాన పుణ్యస్నానం ఆచరించి ఇసుకను సైకత శివలింగాలుగా తయారు చేశారు. అనంతరం కార్తీక దీపం వెలిగించి భక్తిని చాటుకున్నారు. సముద్రం ఒడ్డున వెలసిన భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహా శివలింగానికి పాలాభిషేకం చేశారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీసులు, మెరైన్ సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని శైవాలయాలలో కార్తీక దీపాల శోభ సంతరించుకుంది. పట్టణంలోని పెద్దూరు శివాలయంలో భక్తులు ఉదయ, సంధ్యలలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు. రాత్రి శివాలయం వీధిలో నూతన వధూవరులుగా పార్వతి, పరమేశ్వరులను కొలువుదీర్చి అత్యంత వైభవంగా నిర్వహించిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దామరమడుగు,రేబాల, పెనుబల్లి, మినగల్లు, కాకయకాగొల్లు, రెడ్డిపాళెం, పురందరపురం నాగాయగుంట, నాగమాంబాపురం, పంచేడు తదితర గ్రామాలలో కార్తీక పౌర్ణమి శోభ సంతరించుకుంది. జొన్నవాడ ఆలయంలో భక్తులు కార్తీక దీపాలతో మల్లికార్జునస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షితాయికి నవావరణ పూజలు నిర్వహించారు. ముఖ మండపం ముందు చెట్ల కొమ్మలు, గడ్డితో గుడిసెను ఏర్పాటు చేసి (జ్వాలాతోరణం) దహనం చేశారు. చిన్న వెండి నంది వాహనంపై స్వామి అమ్మవారు గ్రామోత్సవంలో ఊరేగుతూ స్థానిక భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

విడవలూరు: మండలంలోని రామతీర్థం, పార్లపల్లి, తుమ్మగుంట గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రామతీర్థం శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్‌కృష్ణ, ఆలయ ఈవో బొగ్గల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేలాది మంది భక్తులు కార్తీక దీపాలను వెలిగించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. పార్లపల్లి అలగనాథస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ ఉచ్చూరు సుధీప్‌రెడ్డి, ఆలయ ఈవో మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని సత్యనారాయణ వ్రత పూజలను నిర్వహించారు. చౌకిచర్ల పంచాయతీ తుమ్మగుంట గురు నాథస్వామి (అయ్యప్పస్వామి) ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలను నిర్వహించారు. అయ్యప్ప భక్తులు భజనలు, పాటలు పాడారు. అయ్యప్ప భక్తులకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సౌజన్యంతో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, సమాధి శ్రీనివాసులు, కొమ్మి శ్రీధర్ నాయుడు, సత్యవోలు సత్యంరెడ్డి, సురేంద్రరెడ్డి, ఈదూరు సురేస్, సుధీర్ కుడుముల మల్లికార్జున, బద్దిపూడి రాజాలు అన్నదానం చేశారు.

కొడవలూరు : ఉదయకాళేశ్వరస్వామి, గంగా కామాక్షి సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. నాగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు బండారు ఆదిశేషయ్యస్వామి హోమం, దీపోత్సవం నిర్వహించారు.

C.R.I.M.E N.E.W.S

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



ఆవుల శీనయ్య (ఫైల్)

మనుబోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కౌలు రైతు ఆవుల శీనయ్య (42) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని కట్టువపల్లికి చెందిన ఆవుల శీనయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉన్న ఎకరా పొలంలో వరిసాగు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. గడిచిన నాలుగేళ్లుగా ఇతరుల పొలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయితే వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పులపాలయ్యాడు. దీంతో అప్పుల బాధ తట్టుకోలేక రెండు రోజుల క్రితం గడ్డిమందు తాగి శీనయ్య ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం శీనయ్యను బంధువులు నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆమె ఎవరు!?

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి
మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపి
విస్తృతంగా పరిశోధిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్న ఓ మహిళ మృతదేహం బుధవారం వెలుగు చూసింది. మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపీ ఉంది. అయితే ఆ మహిళను అత్యాచారం చేసి హత్య చేశారా.. లేక సాధారణ మరణమా? అని పలువురు అనుమానిస్తున్నారు. వివరాల మేరకు.. నగరంలోని వనంతోపు సెంటర్ సమీపంలో శ్రీచైతన్య పాఠశాలకు వెనుక వైపు ఖాళీ ప్రాంతంలోకి అదే ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ బుధవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లాడు. ఆ ప్రాంతంలో విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో కొంచెం ముందుకెళ్లి చూడగా తూములో ఓ మహిళ మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. దీంతో అతను పరుగులు తీస్తూ బయటకు వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలంకు చేరుకున్న పోలీసులు తూములో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో ఆమె మరణించి సుమారు నెల రోజులకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. కాళ్లు, చేతులు, ఆమె ధరించిన చీరను బట్టి ఉన్నత కుటుంబానికి చెందిన మహిళ అయ్యి ఉంటుందని భావిస్తున్నారు. ఆమె మృతదేహం పక్కనే పెళ్లిల్లో వరుడు ధరించే టోపి ఉండటం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఈ టోపి మృతదేహం పక్కకు ఎలా వచ్చింది.. కక్షతో ఎవరైనా హత్య చేసి మృతదేహం పక్కనే టోపి ఉంచారా.. లేక ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారా? సాధారణ మరణమా.. ఆత్మహత్య.. ఇలా అనేక అనుమానాలు పోలీసుల్లో వ్యక్తమవుతోన్నాయి. ఈ మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు, సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్‌పైపు లీక్‌తో పేలుడు

● పక్కాభవనం ధ్వంసం ● తప్పిన ప్రాణహాని



పేలుడుకు ధ్వంసమైన పక్కా భవనం

సంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో బుధవారం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అయి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించడంతో గ్రామస్థులు ఉలిక్కి పడ్డారు. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడం, సిలిండర్ పేలకపోవడంతో ప్రాణహాని తప్పింది. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పులివర్తి వెంకటసుబ్బానాయుడు, కమల దంపతులు. భర్త నెల్లూరులోని బ్లూడాట్ కొరియర్‌లో పనిచేస్తున్నాడు. భార్య కమల బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలు కళాశాలలో చదువుతున్నారు. ఈక్రమంలో వెంకటసుబ్బానాయుడు ఉదయం డ్యూటీకి వెళ్లాడు. భార్య కమల వంట పూర్తయిన తరువాత ఇంటి కిటికీలు మూసి తాళాలు వేసుకుని డ్యూటీకి వెళ్లింది. పిల్లలు కళాశాలకు వెళ్లారు. వంట చేసి గ్యాస్ సిలిండర్ ఆపిందో లేదో, లేక ఏమైందో తెలియదు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో నుండి పెద్ద శబ్దం రావడంతో ఇంటి చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి ఇంట్లో ఉన్న సిలిండర్ పేలకుండా చర్యలు చేపట్టి సిలిండర్ బయటకు తీశారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం, సిలిండర్ పేలకపోవడంతో ప్రాణహాని తప్పింది. అయితే ఇంటి గోడలతోపాటు కాంక్రీట్ శ్లాబు దెబ్బతింది. అంతేకాకుండా ఇంట్లోని ఎలక్ట్రికల్ సామాన్లు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న బాధితులు ఇంటికి వచ్చి లబోదిబోమన్నారు.

పెళ్లి చేసుకుంటామని హార్డ్‌వేర్ ఇంజనీర్‌ను

మోసగించిన యువతులు

నెల్లూరు(క్రైం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ బ్యూరో ద్వారా పరిచయమైన ఇద్దరు యువతులు పెళ్లి చేసుకుంటామని హార్డ్‌వేర్ ఇంజనీర్‌ను నమ్మించి మోసం చేశారు. అతని చేత ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టించి రూ.లక్షలు దోచేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు నగరానికి చెందిన ఓ యువకుడు హైదారాబాద్‌లో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పెళ్లి సంబదాల కోసం ఓ మ్యారేజ్ బ్యూరోను సంప్రదించారు. వారు కొందరు యువతుల ప్రొఫైల్స్‌ను అతనికి అందించారు. వాటిలో పూర్వ అనే యువతి తాను యూకేలో ఫైనాన్షియల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని, కొంత కలంగా స్నేహం చేద్దామని ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చితే పెళ్లి చేసుకుందామని యువకుడికి మాయమాటలు చెప్పింది. అనంతరం ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని నమ్మించి యువకునితో రూ.2 లక్షలు పెట్టించింది. ఈ క్రమంలోనే అబుదాబిలోని ఓ బ్యాంకులో సీఏగా పనిచేస్తున్న లావణ్య అనే యువతి పరిచయం చేసుకుంది. వివాహం తర్వాత తన తండ్రి కంపెనీ చూసుకోవాలని నమ్మించింది. ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించింది. దీంతో యువకుడు పలు దఫాలుగా రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. నగదు డ్రా చేసుకునేందుకు చూడగా రాలేదు. ఈ విషయమై ఆయన లావణ్యను ప్రశ్నించగా రూ.54 వేలు చెల్లించాలని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన యువకుడు బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 575	

డిసెంబరు 4న ఘంటసాల జయంతి వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఘంటసాల కళానికేతన్ ఆధ్వర్యంలో డిసెంబరు 4న దర్గామిట్ట శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం ఆవరణలోని ఘంటసాల విగ్రహం వద్ద, నగరంలోని టౌనుహాలులో ఘంటసాల జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఘంటసాల కళానికేతన్ అధ్యక్షుడు ఆనందరావు తెలిపారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 8 నుంచి 1గంట వరకు కళాక్షేత్రంలో, సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు టౌనుహాలులో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా టౌనుహాల్‌లో సంగీత కచ్చేరి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ఘంటసాల అభిమానులు, గాయనీగాయకులు, నగర ప్రజలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

ప్రశాంత మనస్సుతోనే క్రియా యోగా సాధ్యం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మానందమయి జన్మదినం సందర్భంగా నగరంలోని కనుపర్తిపాడు వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో క్రియా యోగ ధ్యాన దీక్షా శిబిరం జరిగింది. గురుమాత ఆత్మానందమయి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, నగర ప్రముఖులతోపాటు విదేశాల నుంచి కూడా పలువురు ఆధ్యాత్మిక సాధకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మానందమయి మాట్లాడుతూ మానసిక ఒత్తిడిలు తగ్గాలంటే ధ్యానమే మార్గం అన్నారు. సమాజంలో శాంతి సహనం, సామరస్యం పెరగాలంటే ప్రతి ఒక్కరూ ధ్యానం యోగాను ఒక భాగం చేసుకోవాలని కోరారు.

దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా కల్యాణరాజు



నెల్లూరు(క్రైం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దర్గామిట్ట పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం రోశయ్యను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో రేంజ్ వీఆర్‌లో ఉన్న బత్తుల కల్యాణరాజును నియమిస్తూ గుంటూ రు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం కల్యాణరాజు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అదజేశారు. 1998 బ్యాచ్‌కు చెందిన కల్యాణ రాజు గతంలో జిల్లాలోని గూడూరు, ఉదయ గిరి సీఐగా, సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల కట్టడి, శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

అబద్ధాలు చెప్పొద్దు : సన్నపురెడ్డి

నెల్లూరు(జడ్పీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పోర్టులో ఆయిల్ మాఫియా జరుగుతోందని యోగానంద్ నోటికొచ్చిన అబద్ధాలు చెప్పడం దుర్మార్గమని ఏడిబుల్ ఆయిల్ డీలర్స్ ట్యాంకర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టులో ఇతర రాష్ట్రాల ఆయిల్ ట్యాంకర్లకు అధికంగా వసూళ్లు చేస్తున్నారని శ్రీకాళహస్తికి చెందిన యోగానంద్ ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. కర్నాటక, తమిళనాడు మాఫియా చేతిలో పావుగా మారిన ఆయన పచ్చి అబద్ధాలు చెపుతున్నారన్నారు. కృష్ణపట్నంలో పామాయిల్ ఫ్యాక్టరీలు వచ్చాక, కృష్ణా జిల్లా నుంచి రాయలసీమ జిల్లాల వరకు మొత్తం ట్యాంకర్లు ఇక్కడి నుంచే వ్యాపారం చేస్తున్నాయన్నారు. అయితే నిన్న, మొన్న వచ్చిన వారి ట్యాంకర్లకు లోడులు ఇవ్వలేదన్న అక్కసుతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. యోగానంద్ కాల్‌లిస్ట్ తీసి నిజాలు తేల్చాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

16న 1008 మృతికా శివలింగాలకు లక్ష బిల్వార్చన

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఈనెల 16వతేదీన 1008 మృతికా (పుట్టమట్టి శివలింగాలు) సహస్ర బిల్వార్చన, విష్ణుమూర్తికి తులసీ దళార్చనలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు లలితా శివకుమార్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6.10గంటలకు రుద్రాభిషేకం, 1008 శివలింగాలకు సహస్ర లింగార్చన, కార్తీక దీపోత్సవం 1008 మంది మహిళలచే నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ ఎన్‌సీసీ పోటీలకు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ.దత్తాత్రేయశర్మ తెలిపారు. నగరంలోని కళాశాలలో బుదవా రం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయ న మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన 10ఏ నావెల్ ఎన్‌సీసీ క్యాడెట్స్ కె.సాయిప్రవ్యూత్, కె.దిలీప్‌లు నూజివీడులో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్‌సీసీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయపోటీలకు ఎంపిక చేశారన్నారు. అనంతరం ఇద్దరు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి, మెకానికల్ హెడ్ డాక్టర్ ఏవీఎస్.శ్రీధర్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ఐవీఎస్.యశ్వంత్, కేర్‌టేకర్ డీ.ప్రసాద్, ఏవో వరప్రసాద్, ఏజీఎం బీవీ.శ్రీధర్ పాల్గొన్నారు.

వృద్ధులకు ప్లేట్లు, గ్లాసుల వితరణ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో పాత మున్సిపల్ కార్యాలయంలోని నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు నారాయణ దంత వైద్యశాల హెచ్‌వోడీ డాక్టర్ కన్నన్ బుధవారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, వసతి గృహాల నిర్వాహకుడు దాసరి సుందరం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



రాజరాజేశ్వరి ఆలయంలో కొలువుదీరిన సత్యనారాయణ స్వామి



సామూహిక సత్యనారాయణ వ్రతంలో భారీగా పాల్గొన్న భక్తులు



జీజీహెచ్‌లో కార్తీక పౌర్ణమి వేడుకల్లో దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగాకృతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి అధ్వర్యంలో జరిగిన ఈ వ్రతంలో భారీ సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. అలాగే సుందరేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం గణేష్ ఘాట్‌లో జరిగే కార్తీక మహాదీపోత్సవంలో భక్తులకు రాజరాజేశ్వరి ఆలయం నుంచి ప్రసాదం పంపిణీ చేశారు. రాత్రి రాజరాజేశ్వరి ఆలయం గోపురంపైన, సుందరేశ్వరస్వామి ఆలయం గోపురంపై కార్తీక అఖండ దీపారాధన జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

● గాంధీనగర్ కృష్ణమందిరంలో...

మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం కనుల పండువగా జరిగింది. ఆలయం అర్చకులు శ్రీనివాసాచార్యులు భక్తుల గోత్ర నామాలతో శాస్త్రోక్తంగా వ్రతం చేయించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం కార్తీక దీపారాధనల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

● మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు

నగరంలోని పొగతోట ఆదిశంకరా ధ్యాన మందిరంలో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఆదిశంకరాచార్యులు పరివార దేవతలకు విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. శివలింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేక వారాభిషేకాలు జరిగాయి. దామోదర స్వామికి, విశ్వ కల్యాణార్థం విష్ణు సహస్రనామం, కృష్ణోత్తర లక్ష్మీఅష్టోత్తర శత నామార్చనలు జరి గాయి.

● ప్రభుత్వ ఆసుపత్రిలో..

నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సూపరింటెండెంట్ కే.మాధవి ఆధ్వర్యంలో పలువురు జూనియర్ డాక్టర్లు, అధికారులు, సిబ్బంది కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఏడీ ఏడుకొండలు, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ రమణయ్య, సూపర్‌వైజర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

● ఇస్కాన్‌లో తులసీ దామోదర కల్యాణం

నగరంలోని ఇస్కాన్ మందిరంలో తులసీ దామోదర కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి పర్యవేక్షించారు.

● శత సహస్ర బిల్వార్చన

నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీపరమేశ్వరులకు సహస్ర బిల్వార్చన పత్రాలతో అర్చన జరిగింది. శ్రీమురళీకృష్ణ భక్త బృందం, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణపతి పూజ, గోపూజ, గోపాలపూజ, తులసీమాత పూజలు జరిగాయి. విద్యా సమేత నాగేశ్వరస్వామికి ఏకాదశి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్ధన్‌రావు, గౌరవ సలహాదారులు ఎంపీ అంజనేయులు పర్యవేక్షించారు.

● దీపాలతో మహాశివలింగం

నగరంలోని బాలాజీనగర్ సీతారామమందిరంలో భక్తులు 1008 దీపాలతో కనుల పండువగా మహాశివలింగంను ఆవిష్కరించారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమాలను సీతారామమందిరం కమిటీ వాకాటి నరసయ్య, త్యాగరాజ కల్యాణ మండపం కమిటీలు పర్యవేక్షించారు.

నేటి నుంచి కార్తీక లక్ష దీపోత్సవం



రూపుదిద్దుకుంటున్న యాగశాల

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరం లోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాలు గురువారం ప్రారంభమవుతున్నాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో 3 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈసారి భక్తుల దర్శనార్థం నాగేశ్వర జ్యోతిర్లింగ, పండరీనాథ స్వామి ఆలయాల నమూనాలు కనువిందు చేస్తున్నాయి. శివుడికి అభిషేకం చేసుకునేందుకు 9 అడుగుల శివలింగం నిర్మించారు. గురువారం ఉదయం గణపతి పూజతో లక్షదీపోత్సవం ప్రారంభమవుతుంది. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు ఉంటాయి. తొలిరోజు సాయంత్రం సౌభాగ్య భువనేశ్వరీపీఠాధిపతులు రామానంద భారతి, ఆధ్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు ప్రసంగిస్తారు. శుక్రవారం రాత్రి 8గంటలకు తాండవ కాళీ క్షేత్ర తపోవన మఠాధిపతులు సచ్చిదా నంద మహాస్వామి అనుగ్రహ సంభాషణం జరుగుతుంది. శనివారం సాయంత్రం శ్రీశైలం నుంచి తెచ్చిన శివపార్వతుల ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం జరుగుతుంది.

డ్రైవర్స్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

● రూరల్ ఎమ్మెల్యేకు సీపీఎం నేతల వినతి



రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి బుధవారం ఆయన కార్యాలయంలో సీపీఎం నేతలు వినతిపత్రం అందజేశారు. డ్రైవర్స్ కాలనీలో 40 ఏళ్లుగా నివసిస్తున్న ప్రజలకు ఇళ్లపట్టాలు లేవని సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ అన్నారు. నేతలు పెంచలనర్సయ్య, నరసింహారెడ్డి, శివాజీ, సుబ్రహ్మణ్యం, ఇర్ఫాన్, పర్వీన్ పాల్గొన్నారు.

11 నుంచి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సర్వీసు ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో ఎం.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 11న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలు, నెల్లూరుక్లబ్‌లో లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 12న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్ షార్ట్‌ప్లే పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉద్యోగులు ఆయా కార్యాలయ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు విజయవాడ, గుంటూరులో ఈనెల 19 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

ఆర్‌ఐ కార్తీక్‌రెడ్డికి షోకాజ్ నోటీసు



విస్తీర్ణాన్ని లెక్కిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ రెవెన్యూ విభాగానికి చెందిన ఆర్‌ఐ కార్తీక్‌రెడ్డికి కమిషనర్ నందన్ బుధవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. 17వ డివిజన్ వడ్డిపాళెం ప్రాంతంలో ఓ భవనాన్ని ఆన్‌లైన్ పన్నుకు వాస్తవ పన్నుకు భారీగా తేడా ఉండటంతో పాటు, ఖాళీ స్థలం పన్ను(వీఎల్టీ) లేకుండానే ఆస్తి పన్ను విధించడంపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆర్‌ఐ వివరణ కోరుతూ షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇదే అంశంపై స్థానిక సచివాలయ అడ్మిన్ సతీష్‌రెడ్డికి షోకాజు నోటీసులు జారీ చేశారు. అదే ప్రాంతంలో శ్రీవల్లీ నిలయంలో తాగునీటి కుళాయి మీటర్ రీడింగ్ కంటే తక్కువగా పన్ను వస్తున్నందున అమెనీటీస్ కార్యదర్శి తేజశ్వని, వర్కుఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, రీడర్ తుఫైల్, ఫిట్టర్ రాజారావులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలోనూ అనధికార కుళాయిలను గుర్తించిన ఆయన సంబంధిత అధికారులందరికీ షోకాజు నోటీసులు జారీ చేశారు. కాగా 44వ డివిజన్ లీలామహల్ రోడ్డు వద్ద అనధికారికంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తులను తొలగించారు. ఆపై కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితాపై అభిప్రాయాలను స్వీకరించారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో బంగారు పతకాలు



బంగారు పతకాలు అందుకుంటున్న నిఖిల్‌రామ్

నెల్లూరు(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో నెల్లూరుకు చెందిన పీ.వెంకటసాయి నిఖిల్‌రామ్ పలు విభాగాల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించాడు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో అండర్-18 విభాగంలో 100, 200 మీటర్లలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించడంతో నిర్వాహకులు బుధవారం పతకాలు అందచేసి అభినందించారు. సహచర క్రీడాకారులు, కోచ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

నేతన్నలకు నిత్యావసరాలు, బియ్యం పంపిణీ



నిత్యావసరాలు అందచేస్తున్న నాయకులు

నెల్లూరురూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను తాకిడికి మగ్గం గుంతల్లోకి నీరు చేరి పనికి దూరమైన చేనేత కార్మికులను తక్షణం ఆదుకునేందుకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసరాలను అందచేసింది. వీటిని బుధవారం మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో నేతన్న కార్మిక కుటుంబాలకు అందచేశారు. ఈ సందర్భంగా గుండ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్ పముజుల ప్రదీప్, నెల్లూరు ఏఎంసీ వైస్ చైర్మన్ రాపూరు చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ రూరల్లో నేతన్నలను ఆదుకునేందుకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుళ్లూరు రామయ్య, అన్నం సుధాకర్‌లు పాల్గొన్నారు. కాగా అటు చేనేత కార్మిక సంఘం నాయకులు పముజుల హరి, జక్కుల వెంకటసుబ్బయ్య, పముజుల గోపాలయ్యలు చేనేతలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



మస్తాన్‌బాషాను సన్మానిస్తున్న పీహెచ్‌పీలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ రామ్మోహన్‌ను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరి హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీహెచ్‌పీ) నేతలు బుధవారం సన్మానించారు. డాక్టర్ మస్తాన్‌బాషాను జీజీహెచ్‌లో, డాక్టర్ రామ్మోహన్‌ను ఆయన ఆసుపత్రిలో కలిసి ప్రత్యేకంగా శాలువా, పూలమొక్కలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సహకారంతో సిఫార్సు చేసిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నేతలు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, రాందాసు, రాఘవయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే 35వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ.హరీష్, గంటా సతీష్‌లు బుధవారం తెలిపారు. జిల్లాలో ప్రతిభ కలిగిన బాలబాలికలకు పోటీలు నిర్వహించి వీరిలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన వారిని బాలుర విభాగంలో 14 మంది, బాలికల విభాగంలో 14 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేలా వారిని సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్, సభ్యులు మోజెస్, సునీల్, కోచ్‌లు ఐ.వెంకటేశ్వర్లు, డి.సందీప్, మేనేజర్‌లు సీహెచ్.చైతన్య, ఆర్.లత తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు : తాళ్లపాక అనూరాధ



మాట్లాడుతున్న తాళ్లపాక అనూరాధ

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నారాయణ ఆల్‌వీల్స్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 5వ డివిజన్ అహ్మద్‌నగర్‌లో ఉన్న నారాయణ క్లీనిక్‌లో ఏర్పాటు చేసిన శిబి రంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాలలో పార్టీ లకు అతీతంగా పేద ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలతో పాటు అన్ని పరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానిం గ్‌లతో పాటు ఉచిత మందులు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు శశికుమార్, పూర్ణ, బాల్‌రెడ్డి, హేమంత్, హబీబ్, శారద, తది తరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : మైపాడు తీరంలో మహా శివలింగానికి పాలభిషేకం



బుచ్చి : జొన్నవాడలో జ్వాలాతోరణం





నెల్లూరులో మీనాక్షి, సుందరేశ్వరస్వామి.. రమాదేవి వీరవెంకట సత్యనారాయణ స్వామిల కళ్యాణం



కావలి తీరంలో...

- వైభవోపేతంగా కార్తీక పౌర్ణమి
- శివ, కేశవ ఆలయాల్లో విశేష పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- పటిష్ట భద్రత నడుమ సముద్ర స్నానాలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

శంభో.. శివశంభో!



నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శివ, కేశవుల ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం వేడుకగా జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల వద్ద బారులుతీరారు. శంభోశంకర, హరహర శంకర నామ స్మరణలతో ఆలయాలు హోరెత్తిపోయాయి. కడలి తీరంలో భద్రతకు నిర్దేశించి ప్రాంతాల్లో సముద్ర స్నానాలకు భక్తులకు అనుమతి ఇచ్చారు. కోస్టల్ పోలీసుగార్డులు పర్యవేక్షించారు. జిల్లాలోని అన్నీ దివ్యక్షేత్రాలు ఆలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపారాధనలు కృతికా దీపం దర్శనం ప్రాకారోత్సవాలు జరిగాయి. శివాలయాల్లో రాత్రి జ్వాలాతోరణం, లంకా దహన కార్యక్రమాలు నిర్వహించారు. వైష్ణవ ఆలయాల్లో తిరుమంజనం సేవలు, తులసీదళ అర్చనలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవాలయాల్లో భక్తులకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.



● భక్తజనంతో ఉప్పొంగిన స్వర్ణాలతీరం

నగరంలోని మూలాపేట గణేష్ ఘాట్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్, సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ సంయుక్తంగా కార్తీక దీపోత్సవం, స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం గోపూజ, శివుడికి భక్తుల ద్వారా అభిషేకాలు, శ్రీశైలం నుంచి తెచ్చిన రమాదేవి సహిత వీరవెంకటసత్యనారాయణ స్వామి, మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామిలకు అభిషేకాలు జరిగాయి. అనంతరం కల్యాణోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. సామూహిక లలితా సహస్ర నామ పారాయణాలు, ఇతర పూజా కార్యక్ర మాలతోపాటు రుద్ర హోమం, మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణలు జరిగాయి. ఉదయం, రాత్రి భక్తుల కు వివిధ ఆలయాల నుంచి ప్రసాదాలు పంపిణీ చేశారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి



మాట్లాడుతున్న సినీ గేయరచయిత అనంత శ్రీరామ్

● కనులపండువగా శోభాయాత్ర

మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలతో స్వర్ణలింగేశ్వర ఆలయం నుంచి ఇరుకళల పరమేశ్వరి ఆల యం వరకు శోభాయాత్ర జరిగింది. ఈ శోభా యాత్రను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెం కట్, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, కార్తీక దీపోత్సవ కమిటీ, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు ప్రారంభించారు.

● గంగా హారతులు

ఇరుకళల పరమేశ్వరి ఘాట్ వద్ద రాత్రి హరిద్వార్ నుంచి విచ్చేసిన వేదపండితులతో స్వర్ణాల చెరువుకు గంగా హారతులు వైభవంగా జరిగాయి. అనంతరం మహిళలు స్వర్ణాల చెరువులోకి కార్తీక దీపాలు వదిలారు. పౌర్ణమి చంద్రుడి కాంతిలో కార్తీక దీపాల వెలుగులు భక్తులకు నేత్రానందం కలిగించాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టు సత్యనారాయణ, శ్రీకంఠం రమణయ్య, కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యకురాలు వెన్నెల, సభ్యులు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ, ఆర్ఎస్ఎస్, జనసేన పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురం : భైరవకోనలో భక్తుల దీపారాధన



కందుకూరు : సోమేశ్వరాలయంలో..



బిట్రగుంటలో దీపాల ఆకృతి



సంగంలో పుష్పాలతో జ్యోతిర్లింగాకారం



నెల్లూరు : స్వర్ణాల చెరువులో భక్తులు

వేదగిరిపై కార్తీక శోభ





1. వేదగిరిపై కార్తీక దీపం
2. గరుడుడిపై వేదగిరీశుని ఊరేగింపు

నెల్లూరురూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వేదగిరి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి సన్నిధి ఎదురు, ధ్వజస్తంభం వద్ద పవిత్ర కార్తీక దీపాన్ని వెలిగించి పౌర్ణమి ప్రత్యేకతను చాటారు. అనంతరం గరుడ వాహనంపై ఆశీనులైన లక్ష్మీనరసింహుడి ఊరేగిస్తూ ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, అర్చక బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న దాడులు

- జిల్లావ్యాప్తంగా 72 కేసులు... 31 బస్సుల స్వాధీనం
- తుఫాన్ నేపథ్యంలో ఆగిన రవాణా శాఖ తనిఖీలు
- 10 నుంచి స్కూల్ బస్సులపై...

నెల్లూరు(క్రైం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెలలో కర్నూలు సమీపంలో జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రాష్ట్రంలో వరుస దాడులు చేస్తున్నారు. జిల్లాలో డీటీసీ బీ. చందర్ ఆధ్వర్యంలో దాడులు ముమ్మరం చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్ బస్సులపై 71 కేసులు నమోదు చేశారు. 31 బస్సులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తుఫాన్ నేపథ్యంలో దాడులు ఆగాయని, అయితే నిరంతరం కొనసాగుతాయని రవాణా అధికారులు తెలిపారు.

● నిబంధనలకు నీళ్లు

రోడ్లపై తిరిగే వాహనాలకు నియమ,నిబంధనలు ఉంటాయి. వీటిని వాహన యజమానులు తప్పనిసరిగా పాటించాలి. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి ఆదాయమే లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. ఇటీవల రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు సంబంధించిన ఆర్‌సీలో సీటింగ్ బస్సు అని రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆ బస్సులనే స్లీపర్ బస్సులుగా నడుపుతున్నారు. 2023 తర్వాత రిజిస్ట్రేషన్ అయిన బస్సులకు తప్పనిసరిగా ఎఫ్‌డీఎస్ఎస్ ఉండాలన్న నిబంధన అమలు కావడంలేదు. 2019 నుంచి మార్కెట్‌లోకి వచ్చిన బస్సుల్లో ప్రమాదం జరిగిన సమయంలో అలారం మోగాలన్న నిబంధనలు ఉన్నా పాటించడం లేదు. ఎమర్జెన్సీ డోర్ల వద్ద సీట్లు ఏర్పాటు చేయడం, బస్సు ముందు అద్దాలు పగిలి ఉండటం, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయకపోవడం, డ్రైవరు వెనుక సీటులో మరో డ్రైవర్ కోసం బెర్త్ ఏర్పాటు చేయడం ... తదితర నిబంధనలను యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారు. రవాణాశాఖ అధికారాలు జరిపిన వరుస దాడుల్లో ఈ విషయాలను గుర్తించి, 71 కేసులు నమో దు చేశారు. 31 బస్సులను సీజ్ చేశారు. రూ. 10 లక్షలకుపైగా అపరాధ రుసుం విధించారు.



విద్యాసంస్థల యజమానులతో మాట్లాడుతున్న డీటీసీ చందర్(ఫైల్)

● 10 నుంచి స్కూల్ బస్సులపై...

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి రవాణాశాఖ అధికారులు విద్యాసంస్థల బస్సులపై దాడులు చేయనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల యజమానులతో డీటీసీ ఈనెల 1న జిల్లా రవాశాణాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను తరలించే వాహనాలు తీసుకోవాల్సిన నిబంధనలు, ప్రమాదం జరిగిన సమయంలో ఉండాల్సిన ముందస్తు ఏర్పాట్లపై యజమానులకు వివరించారు. నిబంధనల మేరకు వాహనాలు లేకుంటే ఈనెల 10 నుంచి జరిపే తనిఖీల్లో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఓం నమఃశివాయ..!

మూలాస్థానేశ్వరాయలంలో వైభవంగా కృతికా దీపోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం అన్నీ ఆలయాల్లోనూ వైభవంగా జరిగాయి. మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. శంభో శంకర.. హరహర శంకరా.. అంటూ నామస్మరణలు ఆలయంలో మారుమోగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మూలస్థానేశ్వరస్వామి సన్నిధి, సహస్రలింగేశ్వర స్వామి సన్నిధి, వనంలో శివయ్య సన్నిధుల్లో పాలభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుద్రహోమం జరిగింది. మూలస్థానేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం కార్తీక దీపాలతో ఆలయం కళకళలాడింది. కృతికాదీపం (నూనెతో చంద్రదర్శనం) కోసం వేలాది మంది బారులు తీరి దర్శించుకున్నారు. అనంతరం జ్వాలా తోరణం జరిగింది. ప్రముఖులు పలువురు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



మూలాస్థానేశ్వరాలయంలో కృతికా దీపం వెలిగిస్తున్న అధికారులు, ఆలయ ధర్మకర్తలు

చిన్నారుల సంరక్షణ కేంద్రాలను నిబద్ధతలో నిర్వహించాలి



దత్తత గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్నారుల సంరక్షణ వసతి గృహాలను నిబద్ధతతో నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా నిర్వాహకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో దత్తత గోడపత్రికను ఆవిష్కరించారు. 30 చైల్డ్ కేర్ హోమ్స్‌కు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ జువైనైల్ చట్టం 2015 ప్రకారం ప్రతి చైల్డ్‌కేర్ హోమ్‌ను అన్నీ వసతులతో పాటు పిల్లల భద్రత, ఆరోగ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, జిల్లా ప్రొబేషన్ అధికారి ఫరూక్, బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు కలెక్టరేట్‌లోని పలు సెక్షన్‌లను కలెక్టర్ హిమాన్షు శుక్లా తనిఖీ చేశారు. కలెక్టరేట్ టెర్రస్‌లో పరిస్థితిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భువనేశ్వరమ్మపై ఈర్ష్య ఎందుకు!?

- కాళ్లు పట్టుకునే చరిత్ర నీదైతే.. సేవచేసే గొప్పమనస్సు ఆమెది
- ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత లక్ష్మీపార్వతి అంటే ఆయనకు దైవం... ప్రజా సేవ చేసే గొప్ప మనస్సు ఉన్న నారా భువనేశ్వరమ్మ అంటే ఎందుకంత ఈర్ష్య అని మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. భువనేశ్వరమ్మకు వస్తున్న మంచిపేరు చూసి తట్టుకోలేక అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నారాయణ వైద్య కళాశాలలో అనధికార భాగస్వామి అని ప్రసన్న చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. హెరిటేజ్ సంస్థ చైర్‌పర్సన్‌గా నారా భువనేశ్వరి రానిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో లండన్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా అందజేశారన్నారు. దేశంలోనే అత్యుత్తమ డెయిరీగా తీర్చిదిద్దడంతోపాటు కొత్త ఉత్పత్తుల అవిష్కరణలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు లభించిందని చెప్పారు. ఎన్టీఆర్ మేనేజింగ్ ట్రస్టీగా విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. రాజకీయాల్లో కాళ్లు పట్టుకోవటం ప్రసన్నకు వెన్నతో పెట్టిన విద్య అని, గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు కాళ్లు పట్టుకున్నారని, ఆ తర్వాత జగన్‌రెడ్డి కాళ్లు పట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 50 మంది చనిపోతే జగన్‌రెడ్డి వారిని కనీసం పలకరించిన పాపాన పోలేదన్నారు. అదే భువనేశ్వరమ్మ ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారని వెల్లడించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.2700 కోట్లు బకాయిలు పెట్టిపోతే చంద్రబాబు ప్రభుత్వం వాటిని చెల్లించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఇంకోసారి భువనేశ్వరమ్మ గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

నెల్లూరుకి 'మాల్ ఫీజియన్' అందాలు

నెల్లూరు(సిటీ),(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరాన్ని కార్పొరేషన్ అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చూపరులను ఆకట్టుకునేలా ప్రధాన రోడ్లు, రహదారుల మధ్య డివైడర్లలో ఆకర్షిణీయమైన మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో గార్డెన్లలో ప్రత్యేకంగా కనపడే 'మాల్‌ఫీజియన్' మొక్కలను వివిధ ఆకృతిల్లో ఏర్పాటు చేస్తున్నారు. బాల్స్‌గానూ, కోనులతో పాటు డివైడర్ విస్తీర్ణాన్ని బట్టీ ఆకృతిని డిజైన్ చేస్తున్నట్లు ఎన్ఎంసీ ఉద్యాన అధికారి నరసింహరావు తెలిపారు. నగరంలోకి ప్రవేశించే ప్రాంతాలలోని ప్రధాన డివైడర్ల వద్ద తొలత ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



రైతులకు అందుబాటులో యూరియా

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుసేవా కేంద్రాలు, సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయా కేంద్రాల్లో 18 మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి యూరియా తీసుకెళ్లాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11486
వెండి కిలో ధర	రూ. 149800
వెండి ఒక గ్రాము	రూ. 154.80

న్యూస్ బాక్స్

వైభవంగా మహా పూర్ణాహుతి


హోమంలో పూర్ణాహుతి వేస్తున్న పీఠాధిపతి, భక్తులు

సంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞాన పీఠంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో లలితా రుద్ర మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కార్తీక కోటి దీపోత్సవం చేసి హోమంలో పూర్ణాహుతి వేశారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు


అనంతసాగరంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

అనంతసాగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ అనంతసాగరంలో సీసీ రహదారుల నిర్మాణానికి రూ. 60 లక్షల నిధులు మంజూరు కావడంతో బుధవారం పనులు ప్రారంభించారు. లేఆవుట్ కాలనీ, పూసల కాలనీ, చిన్నగుండం వీధిలో రోడ్లు ఆధునీకరిస్తున్నారు. మంత్రి ఆనం రామనారాణరెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మండల టీడీపీ అధ్య క్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డికి కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉదయగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ రమణయ్యల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సోమశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తరుణవాయి విద్యార్థి ఎంపిక

సంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్‌లో 8వ తరగతి చదువుతున్న షేక్ హసదుల్లా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీల్లో హైజంప్‌లో అండర్ -14 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించాడు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆ మేరకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. దీంతో విద్యార్థిని అభినందించారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

ఉదయగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగులబావి వీధిలో బుధవారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దస్తగిరిఅహ్మద్, ఎంఏ సలీం, షంషీర్, జాఫర్‌అహ్మద్, షరీఫ్, గోగుల రామయ్య, ఫైజీ, యూనస్, తదితరులు పాల్గొన్నారు.

పూల ధరకు రెక్కలు

ఉదయగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓవైపు కార్తీకమాసం, మరోవైపు భక్తులు అయ్యప్ప, శివయ్య, ఆంజనేయస్వామి మాలలు ధరిస్తుండడంతో పూల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణ రోజుల్లో బంతి, చేమంతి, సంపంగి పూలకు అంత డిమాండ్ ఉండేది కాదు. ప్రస్తుతం వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో కిలో వంద రూపాయలు పలుకుతుండగా ప్రస్తుతం వ్యాపారస్తులు రూ.200 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. ఇక గులాబీల ధర బాగా పెరిగింది. కార్తీకమాసం కావడంతో ధరలు పెరిగినా భక్తులు కొనుగోలు చేస్తున్నారు.


ఆత్మకూరు: శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు


అనంతసాగరం: సోమశిలలో కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు


సంగం: సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం పట్టణంలోని ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఆత్మకూరు చెరువులో భక్తులు కార్తీక దీపాలు వదిలి పూజలు చేశారు. కాశీనాయన ఆశ్రమం, శివాలయంలో భక్తులు దీపాలు వెలిగించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, అలఘనాధస్వామి ఆలయం, కాశినాయనాశ్రమ ప్రాంగణంలో జ్ఞానసరస్వతీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **అనంతసాగరం:** సోమశిల జలాశయ ప్రాంగణంలోని సోమేశ్వరుని ఆలయంలో బుధవారం కార్తీక దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకొన్నారు.

● **చేజర్ల:** మండలంలోని కోటితీర్థం గ్రామంలో కోటేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారికి పూజలు నిర్వహించి నదిలో కార్తీక దీపాలు విడిచిపెట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంతో దీపాలు వెలిగించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని కాకివాయి గ్రామంలోని హంసరామస్వామి ఆశ్రమంలో భక్తులు పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. చేజర్లలోని లుంబినీ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులు శివలింగం ఆకృతిలో దీపాలు వెలిగించారు.

● **సంగం :** స్థానిక సంగమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం సంగమేశ్వరస్వామిని పులివాహనంపై ఉంచి గిరిప్రదర్శన చేశారు. సాయంత్రం ఆలయంలో పుష్ప జ్యోతిర్లింగాకారం ఏర్పాటు చేసి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వంగల్లులోని భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి పూజలు చేసి దీపాలు వెలిగించారు.


భైరవకోనలో స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

● **ఉదయగిరి:** కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్ధేశ్వరస్వామి, కాశినాయనగడ్డ, అప్పసముద్రం, లింగాలదొన క్షేత్రం, జీ.అయ్యవారిపల్లి, ఆర్లపడియ తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని వరికుంటపాడు, కాంచెరువు శివాలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివార్లను ప్రత్యేక పూజ లు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పలు గ్రామాల నుంచి భక్తులు సమీప సిద్ధేశ్వరం, భైరవకోన, గండిపాళెంలోని ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

● **సీతారామపురం:** మండలంలోని భైరవకోన, ఘటికసిద్ధేశ్వరం, సీతారామపురంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర జలపాతాలలో పుణ్యస్నానాలు ఆచరించి, శివనామస్మరణ చేస్తూ శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుని దర్శించుకుని ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. సిద్ధేశ్వరంలోని ఇష్టకామేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఉదయగిరి శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


వరికుంటపాడులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


చేజర్ల: లుంబినీ విద్యాలయంలో శివలింగం ఆకృతిలో దీపాలు వెలిగించిన విద్యార్థులు

చెక్కనగిషీ స్టాల్‌ను సందర్శించిన మంత్రి లోకేష్


స్టాల్‌లో వస్తువులను పరిశీలించి నిర్వాహకుడు జాకీర్‌హుస్సేన్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేష్

ఉదయగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని శేషసాయి కల్యాణ వేదికలో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఏర్పాటుచేసిన ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం స్టాల్‌ను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన స్టాల్‌లో ఉన్న చెక్కనగిషీ వస్తువులను పరిశీలించి నిర్వాహకుడు జాకీర్‌హుస్సేన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళతానని మంత్రి తెలిపినట్లు నిర్వాహకుడు తెలిపారు.

గిరిజనులకు వివాహ కానుక పథకం


నూతన వధువుకు నగదు, పెండ్లి దుస్తులు అందజేస్తున్న కంచి

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సేవలు అభినందనీయం అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, పలువురు గిరిజన మహిళా నాయకులు పేర్కొన్నారు. బుధవారం నూతనంగా గిరిజనులకు వివాహ కానుక పథకం కింద మున్సిపాల్టీ పరిధిలోని నూతన వధువుకు కంచి పరమేశ్వరరెడ్డి రూ. 10వేల నగదు, వధువరులకు పెండ్లి వస్త్రములు కాను కగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గిరిజన కుటుంబం ఈ పథకాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం దాత కంచి పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ముస్లీం మైనార్టీ తదితర వెనుకబడిన కులాల వారికి ఈ పెండ్లి కానుక పథకం అమలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పలువురు గిరిజన మహిళా నాయకులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు నిలయాలు


అన్నపూర్ణానగర్‌లో నివాసాల మధ్య నీరు నిల్వ చేరి అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం

ఉదయగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ చేరి వ్యాధులకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రధానంగా అన్నపూర్ణానగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో నివాసాల మధ్య ఖాళీ స్థలాలు అధికంగా ఉండడంతో నివాసాల్లో నుంచి మురుగు నీటితోపాటు వర్షాలు కురిసే సమయంలో చేరే వరద నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలకు కేంద్రాలుగా, విష పురుగులకు ఆవాసాలుగా మారడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చీకటి పడితే విషపురుగుల సంచారం అధికమైందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టి ప్రజలను వ్యాధులు, విషపురుగుల నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అపస్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు


స్పోర్ట్స్ మీట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న అపస్మా నేతలు

ఆత్మకూరు నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అపస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈనెల చివరి వారంలో పాఠశాల, నియోజకవర్గం, జిల్లాస్థాయిల్లో ఆటల పోటీలు నిర్వహించేలా కమిటీ తీర్మానించిందని అపస్మా రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆత్మకూరులో అపస్మా నియోజకవర్గ ప్రెసిడెంట్ కె కోటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అపస్మా ఆధ్వర్యంలో బిఎంఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి అందులో రూ. 50 లక్షలను జమచేసి ప్రతి ఏడాది అందులో వచ్చే వడ్డీతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మొమెంటో, సర్టిఫికేట్, మెడల్ బహుకరించే విధంగా నిర్ణయించామన్నారు. అనంతరం స్పోర్ట్స్ మీట్ కరపత్రాన్ని అపస్మా నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సిహెచ్‌వి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, సెక్రటరీ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా గేమ్స్ కన్వీనర్ జి ప్రభాకర్, ఆత్మకూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు టీసీ వెంకసుబ్బయ్య, ఆత్మకూరు నియోజకవర్గ సెక్రటరీ పి మలికార్జుననాయుడు, ట్రెజరర్ ఏ వెంకటేశ్వరరెడ్డి, పలు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కరువు

● చిన్నారుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు


దువ్వూరు ముస్లింపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మొండి గోడలతో ఉన్న మరుగుదొడ్డి

సంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో చిన్నారులతోపాటు కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 52 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో కొన్ని కేంద్రాల్లో కనీస వసతులు కూడా లేవు. దువ్వూరు ముస్లింపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి మొండి గోడలతో దర్శనమిస్తోంది. నిర్మాణం ఆగిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. అదేవిధంగా కేంద్రంలో చిన్నారుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటుచేసిన ప్యూరీఫై మినీ వాటర్‌కిట్ మరమ్మతులకు గురై ఆరు నెలలైనా పట్టించుకోకపోవడంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు మధ్యాహ్న భోజన సమయంలో కుళాయి నీళ్లే తాగాల్సి వస్తోంది. అదేవిధంగా ముక్తాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి సౌకర్యం ఉన్నా నీటి వసతి లేక తాళం వేశారు. సంగం కొత్తూరు, వడ్డిపాళెం, ఎస్‌వీఆర్ పురం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. సంగం దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలమవడంతో పాఠశాల గదిలో నిర్వహిస్తున్నారు. రాళ్లచెలిక మిక్స్‌డ్ కాలనీ, ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాలు రెండూ ఒకే కేంద్రంలో నిర్వహిస్తున్నారు. తరుణవాయి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం పాఠశాల ఆవరణలో ఉన్నా లోతట్టులో ఉండడంతో వర్షాకాలం కేంద్రంలోకి నీరు వస్తుండడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. కేంద్రాల్లో సరైన వసతులు లేకపోవడంతో చిన్నారులను కేంద్రాలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి


అవుల శీనయ్య (ఫైల్)

మనుబోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కౌలు రైతు అవుల శీనయ్య (42) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని కట్టువపల్లికి చెందిన అవుల శీనయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉన్న ఎకరా పొలంలో వరిసాగు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. గడిచిన నాలుగేళ్లగా ఇతరుల పొలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయితే వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పులపాలయ్యాడు. దీంతో అప్పుల బాధ తట్టుకోలేక రెండు రోజుల క్రితం గడ్డిమందు తాగి శీనయ్య ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం శీనయ్యను బంధువులు నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆమె ఎవరు!?

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపి

విస్తృతంగా పరిశోధిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్న ఓ మహిళ మృతదేహం బుధవారం వెలుగు చూసింది. మృతురాలి పక్కనే వరుడి పెళ్లి టోపీ ఉంది. అయితే ఆ మహిళను అత్యాచారం చేసి హత్య చేశారా.. లేక సాధారణ మరణమా? అని పలువురు అనుమానిస్తున్నారు. వివరాల మేరకు.. నగరంలోని వనంతోపు సెంటర్ సమీపంలో శ్రీచైతన్య పాఠశాలకు వెనుక వైపు ఖాళీ ప్రాంతంలోకి అదే ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ బుధవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. ఆ ప్రాంతంలో విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో కొంచెం ముందుకెళ్లి చూడగా తూములో ఓ మహిళ మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. దీంతో అతను పరుగులు తీస్తూ బయటకు వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలంకు చేరుకున్న పోలీసులు తూములో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో ఆమె మరణించి సుమారు నెల రోజులకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. కాళ్లు, చేతులు, ఆమె ధరించిన చీరను బట్టి ఉన్నత కుటుంబానికి చెందిన మహిళ అయ్యి ఉంటుందని భావిస్తున్నారు. ఆమె మృతదేహం పక్కనే పెళ్లిల్లో వరుడు ధరించే టోపి ఉండటం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఈ టోపి మృతదేహం పక్కకు ఎలా వచ్చింది.. కక్షతో ఎవరైనా హత్య చేసి మృతదేహం పక్కనే టోపి ఉంచారా.. లేక ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారా? సాధారణ మరణమా.. ఆత్మహత్య.. ఇలా అనేక అనుమానాలు పోలీసుల్లో వ్యక్తమవుతోన్నాయి. ఈ మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు, సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్‌పైపు లీక్‌తో పేలుడు

● పక్కా భవనం ధ్వంసం ● తప్పిన ప్రాణహాని


పేలుడుకు ధ్వంసమైన పక్కా భవనం

సంగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో బుధవారం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అయి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించడంతో గ్రామస్థులు ఉలిక్కి పడ్డారు. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడం, సిలిండర్ పేలకపోవడంతో ప్రాణహాని తప్పింది. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పులివర్తి వెంకటసుబ్బానాయుడు, కమల దంపతులు. భర్త నెల్లూరులోని బ్లూడాట్ కొరియర్‌లో పనిచేస్తున్నాడు. భార్య కమల బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలు కళాశాలలో చదువుతున్నారు. ఈక్రమంలో వెంకటసుబ్బానాయుడు ఉదయం డ్యూటీకి వెళ్లాడు. భార్య కమల వంట పూర్తయిన తరువాత ఇంటి కిటికీలు మూసి తాళాలు వేసుకుని డ్యూటీకి వెళ్లింది. పిల్లలు కళాశాలకు వెళ్లారు. వంట చేసి గ్యాస్ సిలిండర్ ఆపిందో లేదో, లేక ఏమైందో తెలియదు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో నుండి పెద్ద శబ్దం రావడంతో ఇంటి చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి ఇంట్లో ఉన్న సిలిండర్ పేలకుండా చర్యలు చేపట్టి సిలిండర్ బయటకు తీశారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం, సిలిండర్ పేలకపోవడంతో ప్రాణహాని తప్పింది. అయితే ఇంటి గోడలతోపాటు కాంక్రీట్ శ్లాబు దెబ్బతింది. అంతేకాకుండా ఇంట్లోని ఎలక్ట్రికల్ సామాన్లు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న బాధితులు ఇంటికి వచ్చి లబోదిబోమన్నారు.

పెళ్లి చేసుకుంటామని హార్డ్‌వేర్ ఇంజనీర్‌ను మోసగించిన యువతులు

నెల్లూరు(క్రైం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ బ్యూరో ద్వారా పరిచయమైన ఇద్దరు యువతులు పెళ్లి చేసుకుంటామని హార్డ్‌వేర్ ఇంజనీర్‌ను నమ్మించి మోసం చేశారు. అతని చేత ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టించి రూ.లక్షలు దోచేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు నగరానికి చెందిన ఓ యువకుడు హైదారాబాద్‌లో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పెళ్లి సంబదాల కోసం ఓ మ్యారేజ్ బ్యూరోను సంప్రదించారు. వారు కొందరు యువతుల ప్రొఫైల్స్‌ను అతనికి అందించారు. వాటిలో పూర్వ అనే యువతి తాను యూకేలో ఫైనాన్షియల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని, కొంత కలంగా స్నేహం చేద్దామని ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చితే పెళ్లి చేసుకుందామని యువకుడికి మాయమాటలు చెప్పింది. అనంతరం ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఆదాయం వస్తుందని నమ్మించి యువకునితో రూ.2 లక్షలు పెట్టించింది. ఈ క్రమంలోనే అబుదాబిలోని ఓ బ్యాంకులో సీఏగా పనిచేస్తున్న లావణ్య అనే యువతి పరిచయం చేసుకుంది. వివాహం తర్వాత తన తండ్రి కంపెనీ చూసుకోవాలని నమ్మించింది. ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించింది. దీంతో యువకుడు పలు దఫాలుగా రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. నగదు డ్రా చేసుకునేందుకు చూడగా రాలేదు. ఈ విషయమై ఆయన లావణ్యను ప్రశ్నించగా రూ.54 వేలు చెల్లించాలని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన యువకుడు బుధవారం చిన్నబజారు పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 575	

మార్షల్ ఆర్ట్స్ బాలికలకు అవసరం

బిట్రగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ అవసరం ఎంతైనా ఉందని ఎంఈవో జయమ్మ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు బుధవారం తైక్వాండో శిక్షణ తరగతులను మాస్టర్ ఈ. రవిగన్ ప్రారంభించారు. చిన్నతనం నుంచి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బాలికలకు తైక్వాండో శిక్షణ ఇస్తున్న మాస్టర్ రవిగన్

అక్రమ అరెస్టులు సరికాదు : విష్ణు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పూర్వాపరాలు పరిశీలించాక నిజంగానే తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకోవాలే తప్ప, అక్రమంగా అరెస్టులు చేయడం భవిష్యత్తుకు ప్రమాదకరమని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అల్లూరులోని ఆయన నివాసంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నేత జోగి రమేష్ అరెస్టుపై ఆయన స్పందిస్తూ మేథోశక్తి కలిగిన సీఎం చంద్రబాబు తొందరపాటు అరెస్టులు ఎలా చేయిస్తున్నారని ప్రశ్నించారు. జోగి రమేష్‌ను అరెస్టు చేసినంత మాత్రాన నకిలీ మద్యాన్ని నిలువరించగలిగారా? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ కాకుండా ప్రధానితో మాట్లాడి నిలువరించలేకున్నారని, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి వైద్య విద్యను ఖరీదైన వ్యవహారంగా మారుస్తున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులు నేడు అలవాటు చేస్తే, భవిష్యత్తులో వచ్చే నాయకులు కూడా ఇదే పంథాను అనుసరిస్తారనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, గోసల గోపాల్ రెడ్డి, కోమిట్ల పవన్‌కుమార్‌రెడ్డి, మోమిడి మాధవరావు, కరీముల్లా పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

● శివకేశవాలయాలకు పోటెత్తిన భక్తులు ● సముద్రంలో పుణ్యస్నానాలు ● ఆలయాల్లో దీపారాధనలు


లింగసముంద్రం : మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


వీవీపాలెం : శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఉలవపాడులోని శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కావలి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం కావలి రూరల్ మండలంలోని సముద్రతీరం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీరప్రాంతాలలోని సముద్ర తీరానికి తెల్లవారు జామునుంచే భక్తుల రాక ప్రారంభమైంది. సముద్రంలో స్నానాలు చేసి, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు ఐదారువేల మందిదాకా భక్తులు పూజల్లో పాల్గొన్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కావలి డీఎస్పీ పీ శ్రీధర్, రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐ తిరుమలరెడ్డి, మెరైన్ ఎస్‌ఐ జానకి రామిరెడ్డిలు సిబ్బందితో తీర ప్రాంతంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ భక్తులను అప్రమత్తం చేయటమే కాక, గజ ఈతగాళ్లు, బోట్లను కూడా సిద్ధం చేసి ఉంచామన్నారు. పౌర్ణమి సందర్భంగా సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉందని, భక్తులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

కావలి (టౌన్): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం పట్టణంలోని శివాలయాలు, వైష్ణవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాతూరు, వెంగళరావునగర్, ముసునూరు శివాలయాలు, హనుమత్‌క్షేత్రంలోని ఆలయం, విష్ణు, సత్యనారాయణస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసంలో శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీమ పౌర్ణమి నాడు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కార్తీక దీపారాధనలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయాలన్నీ విద్యుద్దీప కాంతులతో కార్తీక శోభను సంతరించుకున్నాయి.

కందుకూరు : కార్తీక పౌర్ణమిని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలోని శైవక్షేత్రాలకు వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. పట్టణంలోని స్కంధ పురి సోమేశ్వరాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు వారికి తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందజేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంకమ్మ ఆలయంలోనూ కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శివలింగానికి అభిషేకం నిర్వహించారు. పట్టణంలోని జనార్ధనస్వామి ఆలయం, మాచవరం, మోపాడు, ఓగూరు, పలుకూరు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక దీపోత్సవం జరిగింది. కాగా, పట్టణంలోని కనిగిరి రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారణ స్వాములకు నిర్వహిస్తున్న అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించి అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవాసమితి ప్రతినిధులను అభినందించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కోదండరామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు, కళవళ్ల, రోళ్లపాడు, కొండసముద్రం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవతామూర్తులకు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములు భారీ అన్నదానం ఏర్పాటుచేశారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులవరంలోని గంగాపార్వతి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయప్రాంగణంలో దీపపు ప్రమిదలతో రూపొందించిన శివలింగ అలంకారం భక్తులకు కనువిందు చేసింది. త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అధినేత పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జక్కేపల్లిగూడూరు పంచాయతీ సోమేశ్వరపురంలోని కామాక్షితాయి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఉలవపాడు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే కార్తీక స్నానాలు ఆచరించి మహిళలు దేవాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ముక్కంటికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అలగాయపాలెం, కరేడు, రామాయపట్నం, చాకిచర్లలలో పెద్దఎత్తున భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఒడ్డున కార్తీక దీపాలు వెలిగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

లింగసముద్రం : కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాలలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మొగిలిచెర్లలోని దత్తాత్రేస్వామి ఆలయం వద్ద మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. పలు గ్రామాల నుండి వచ్చిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పరమశివుడిని దర్శించుకొని ప్రత్యే పూజలు చేశారు. అలాగే మండలంలోని అన్ని శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

కొండాపురం : కార్తీక పౌర్ణమిని మండలంలోని పలు గ్రామాలలో భక్తులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. కార్తీకమాసంలో భక్తులు పవిత్రస్నానాలు చేసి వేకువజాము నుండే శివాలయాలకు వెళ్లి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రమిదలలో ఆవు నెయ్యితో 365 దీపాలను వెలిగించారు. ఇలా చేస్తే 365 రోజులు పూజలు చేసినట్లేనని భక్తుల నమ్మకం. మండలంలోని గానుగపెంటపంచాయతీ ఆదిమూర్తిపురం, గుడవళ్లూరు, గరిమెనపెంట, కొమ్మి గ్రామాలలోని శివాలయాలలో భక్తులు అధికసంఖ్యలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

అల్లూరు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అల్లూరు మండలంలోని అన్ని శైవాలయాల్లో బుధవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని ఇస్కపల్లి శివాలయంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు ఆది దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకాశదీపం, జ్వాలా తోరణం కార్యక్రమాలు ఆధ్యాత్మికతను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, సుజన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలోభక్తులు ఆలయాలకు చేరుకొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

కలిగిరి : పట్టణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, సిద్దనకొండూరులోని సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. మహిళలు ఆలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.


కొండాపురం : పూజలు చేస్తున్న భక్తులు


అల్లూరు : ఇస్కపల్లి శివాలయంలో పూజల్లో పాల్గొన్న బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు


కావలిటౌన్ : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఓటు హక్కు ప్రాధాన్యత తెలుసుకోండి


ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

లింగసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పాధాన్యత తెలుసుకోవాలని తహసీల్దార్ కె కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, రాజకీయ నాయకుల భవిష్యత్తును నిర్ణయించేది మీరే అని అన్నారు. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యం విలువలు కాపాడాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎంవి శివకుమార్, ఆర్ ఐ ఎం రమణయ్య, హెచ్ం యు మాధవరావు, బిల్‌ఓ శ్రీదేవి, కంప్యూటర్ ఆపరేటర్ మదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిత కోసమే కోటి సంతకాలు


కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

కావలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిత కోసమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోటి సంతకాల ఉద్యమం చేపట్టారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం కోటి సంతకాల సేకరణ జరిగింది. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంపాని రాఘవులు, సర్పంచ్ సురేష్, మాజీ సర్పంచ్ కాకి వెంకయ్య, వైసీపీ నాయకులు సన్నిబోయిన ప్రసాద్, తిరుపతి, కోసూరి శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు


సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు

కావలి (టౌన్) నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా డీఆర్ విశ్వోదయలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. బుధవారం జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఎంఎం హాలులో జరిగిన డివిజన్ స్థాయి సాంస్కృతిక పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏక పాత్రాభినయం, వక్తృత్వ, నృత్య పోటీలు, జానపద, పౌరాణిక సాంఘిక విభాగాల బృంద పోటీల్లో చిన్నారులు తమ అభినయంతో అలరించారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, ఆర్ మాల్యాద్రి, ప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా కృష్ణప్రసాద్, నల్లూరు రామకృష్ణ, అభిమన్యు, కొండలరావు వ్యవహరించారు.

బీజేపీలో ప్రతీ కార్యకర్త ఓ నాయకుడే..!


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కావలి (టౌన్) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ ప్రవాస యోజన కార్యక్రమం బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమని, బీజేపీలో ప్రతీ కార్యకర్త ఓ నాయకుడేనన్నారు. త్వరలో బూలింగ్ బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, వివిధ మోర్చా కమిటీలు నియమించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రధాని మోదీ పిలుపుతో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించేలా ప్రజలను జాగృతపరచాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నేతలు కె బ్రహ్మానందం, జీఎస్టీ మండలి సభ్యులు అమరా సుబ్బారావు, పరుసు వెంకటేశ్వర్లు, మామిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కలిగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల వద్ద కలిగిరి-సంగం ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ నేపథ్యంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఏ శ్రీను పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి రోడ్లపై ఏర్పడిన గుంతలను బుధవారం మట్టితో పూడ్చించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసిన మోడల్‌స్కూల్ విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని వాహనచోదకులు, ప్రయాణీకులు అభినందించారు.

వర్షపు నీరు పోయే దారేది..!?


కొత్త కొండసముద్రం గ్రామంలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

వలేటివారిపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త కొండసముద్రం గ్రామంలోని ప్రధాన రహదారిపై మోకాటిలోతు వర్షం నీరు నిలిచిపోయాయి. వర్షం నీరు పోయే దారిలేక ప్రధాన రహదారిపైనే నిలిచిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, గ్రామస్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై నిలిచిన మోకాటిలోతు నీళ్లలో ద్విచక్రవాహనదారులు పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రధాన రహదారిపై వర్షంనీరు నిలిచిన ప్రదేశంలో మూడు అడుగులు సిమెంటురోడ్డు ఏర్పాటుచేసి కల్వర్టు నిర్మిస్తే వర్షంనీరు నిల్వలేకుండా పోతాయని గ్రామస్థులు తెలిపారు.

వ్యాస రచన పోటీలో నలంద విద్యార్థుల ప్రతిభ

కావలి (టౌన్) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గొల్లమూడి వీధిలోని నలంద ఒలింపియాడ్ పదవ తరగతి విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. తెలుగు మాధ్యమంలో ఏ సాయిపార్థివ్ పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా బీవీఎస్ మోక్ష ద్వితీయ స్థానం, భార్గవి తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆంగ్ల మాధ్యమంలో బీ తేజస్విని పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, వీ శిల్ప, నందిని ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. బుధవారం ఒకటవ పట్టణ సీఐ ఫిరోజ్, నలంద డైరెక్టర్ ఎండీ వశీం, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

నేడు మోచర్ల వద్ద టీడీపీ నేతలతో లోకేష్ భేటీ

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని దగదర్తికి విచ్చేస్తున్న రాష్ట్రమంత్రి, టీడీపీ యువనేత నారా లోకేష్ గురువారం ఉదయం 7 గంటలకు కందుకూరు నియోజకవర్గంలోని మోచర్ల వద్ద ఆగి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు.

ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ రామ్మోహన్‌ను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీహెచ్‌పీ) నేతలు బుధవారం సన్మానించారు. డాక్టర్ మస్తాన్‌బాషాను జీజీహెచ్‌లో, డాక్టర్ రామ్మోహన్‌ను ఆయన ఆసుపత్రిలో కలిసి ప్రత్యేకంగా శాలువా, పూలమొక్కలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సహకారంతో సిఫార్సు చేసిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నేతలు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్, రాందాసు, రాఘవయ్య రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన మురారిశెట్టి శ్రీకాంత్, ఎమ్మెల్యే ఇంటూరిలను సత్కరిస్తున్న ఆర్యవైశ్య యువకులు

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు మురారిశెట్టి శ్రీకాంత్ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, యువకుల సమక్షంలో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు శ్రీకాంత్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ శ్రీకాంత్ చేరికతో టీడీపీకి మరింత బలం చేకూరిందని, ఆర్యవైశ్యులు అంతా కలిసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు గుర్రం శింగయ్య, వేముల సుకుమార్, డాక్టరు తన్నీరు మల్లిఖార్జున, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నైట్‌సర్వీస్ ప్రారంభం

కందుకూరు - సింగరాయకొండల మధ్య ఆర్టీసీ నైట్ సర్వీస్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైలు ప్రయాణీకుల సౌకర్యార్థం 8 సంవత్సరాల క్రితం వరకు నైట్ సర్వీస్ ఉండేదని, ఆతర్వాత నిలిచిపోయిన సర్వీస్‌ను ప్రస్తుతం పునరుద్ధరించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఆర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, యూ. శ్రీనివాసరావు,సీహెచ్. కొండయ్య, కూనం నరేంద్ర, షేక్ మున్నా, ఎం.శ్రీనివాసరావు, ఎం. సుధీర్, కొత్తూరి వెంకటసుధాకర్, షేక్ రూబీ పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ - 2025 పోటీల్లో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాంకేతిక ప్రతిభతో తమ కళాశాల విద్యార్థుల ఆవిష్కరణ పలువురి ప్రశంసలందుకుని బహుమతులు సాధించిందని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ (ఏఐ) విభాగానికి చెందిన థర్డ్ ఇయర్ విద్యార్థులు పవన్, రాఘవేంద్ర, గణేష్, మణికుమార్‌లు రూపొందించిన మల్టీపర్పస్ బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ కమ్ ఇంటర్ కల్టివేటర్ ప్రాజెక్టును కడపలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ఇన్నోవేషన్ 2025 పోటీలలో ప్రదర్శించగా ప్రశంసలు, బహుమతులు సాధించిందన్నారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన కళాశాల ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావును, విద్యార్థులను ఆయన అభినందించారు.

డిసెంబరు 4న ఘంటసాల జయంతి

నెల్లూరు(సాంస్కృతికం),(ఆంధ్రజ్యోతి): ఘంటసాల కళానికేతన్ ఆధ్వర్యంలో డిసెంబరు 4న దర్గామిట్ట శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం ఆవరణలోని ఘంటసాల విగ్రహం వద్ద ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు జయంతి వేడుకలు జరుగుతాయని కళానికేతన్ అధ్యక్షుడు ఆనందరావు తెలిపారు.

పోర్టు నిర్వాసితుల కాలనీలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

● నీటి ప్రవాహంతో దెబ్బతిన్న సపోటా చెట్లు ● న్యాయం చేయాలని బాధిత రైతు మొర


వర్షపు నీళ్ల తాకిడికి పడిపోయిన ప్రహరీగోడ, కోతకు గురైన సపోటా తోట

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణంలో భాగంగా ఖాళీ చేసిన గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కింద కట్టిస్తున్న ఇళ్ల ప్లాటుల్లో వేసిన రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు నిర్మాణం కారణంగా ఖాళీచేసిన గ్రామాల్లో ఒకటైన కర్లపాలెం గ్రామస్థుల కోసం రామాయపట్నం మెయిన్ రోడ్డుకు ఆనుకొని మారిటైం బోర్డు కొనుగోలు చేసిన 43 ఎకరాల్లో 370 ప్లాట్లు వేసి సిమెంట్ రోడ్లు, డ్రైనేజి ముందస్తుగా నిర్మించారు. ఇళ్ల నిర్మాణాలు పోర్టు ఇంజనీరింగ్ అథారిటి విభాగం పరిధిలోనే జరుగనున్నాయి. అయితే కాలనీలో ఏర్పాటుచేసిన డ్రైన్‌ల ద్వారా మురుగు నీరు వెళ్లే వాటం దక్షిణం నుంచి ఉత్తరం వైపునకు మళ్లించి కాలువలు నిర్మించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద వేసిన లేఅవుట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రహరీకి ఆనుకొని ఉత్తరం వైపున చాగొల్లు గ్రామానికి చెందిన తమ్మినేని నరసింహనాయుడుకు చెందిన 14 ఎకరాల సపోటా తోట ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పోర్టు నిర్వాసితుల లేఅవుట్‌లోని వర్షపు నీరంతా డ్రైన్‌ల ద్వారా ప్రవహించడంతో సపోటా చెట్లు పొలం వైపున ప్రహరీ గోడ కూలిపోయింది. అంతేగాక లేఅవుట్‌లో వర్షం నీరంతా సపోటా తో టలో ప్రవహించడం తో నష్టం జరిగిందని, పోర్టు ఇంజనీరింగ్ అధికారులకు జరిగిన నష్టాన్ని చూపించినా ని మ్మకు నీరెత్తినట్లు ఉన్నారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. కాలనీ లేఅవుట్ నిర్మాణంలో లోపభూయిష్ట డ్రైనేజి వ్యవస్థ కారణంగా, ఇంజనీరింగ్ అధికారుల అనాలోచిత నిర్మా ణం వలన పట్టా భూమి కోతకు గురై సపోటా చెట్లకు నష్టం జరిగిందన్నారు. వర్షపు నీరు, కాలనీవాసులు వాడిన మురుగు నీరంతా దిగువున ఉన్న సపోటా తోటలోకే చేరుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కర్లపాలెం పోర్టు నిర్వాసితుల లేఅవుట్‌లో నిర్మించిన డ్రైనేజి వ్యవస్థను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.



కార్తీక పౌర్ణమి గరుడసేవ



తిరుమల క్షేత్రంలో బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణలు, కర్పూర హారతుల నడుమ గరుడవాహనం కన్నులపండువగా జరిగింది. కార్తీక మాసంలోని పౌర్ణమి కావడంతో ఈ గరుడ వాహన సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి ఆలయం ముందు | కార్తీక వెలుగులు


కార్తీక పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం కార్తీక వెలుగుల్లో ప్రత్యేక కళతో దర్శనమిచ్చింది. తిరుమల, తిరుపతి స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం ముందున్న గొల్లమండపం నుంచి అఖిలాండం వరకు నేతి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతి దీపాల వెలుగుల్లో ఆలయ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరించుకుంది.

'బ్లూబర్డ్' ప్రయోగానికి సన్నాహం

● షార్‌కు చేరిన ద్రవ ఇంధనం

అమెరికాకు చెందిన కమ్యూనికేషన్ ఉపగ్రహం.. బ్లూబర్డ్‌ను డిసెంబరు తొలివారంలో షార్ నుంచి ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపనున్నారు. దీనికి సంబంధించి రాకెట్ అనుసంధాన పనులు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వ్యాబ్‌లో జరుగుతున్నాయి. రాకెట్ రెండో దశలో ఉపయోగించే ద్రవ ఇంధనాన్ని బుధవారం రెండు ప్రత్యేక వాహనాల్లో తమిళనాడులోని లిక్విడ్ ప్రొపెలెంట్ సెంటర్ మహేంద్రగిరి నుంచి భారీ భద్రత నడుమ రోడ్డు మార్గాన షార్‌కు తీసుకొచ్చారు. కాగా, 6,400 కిలోల బరువైన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థ అభివృద్ధి చేసింది. అక్టోబరు 15న దీనిని షార్‌కు తీసుకొచ్చారు. ఎనిమిది మంది అమెరికా శాస్త్రవేత్తలూ వచ్చి ప్రయోగ ఏర్పాట్లలో పాలు పంచుకుంటున్నారు. ఇంతటి బరువైన విదేశీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించడం ఇదే తొలిసారి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి


భారీ భద్రత నడుమ షార్‌కు వెళ్తున్న ఇంధన వాహనాలు

గ్యాస్, ఆయిల్ ఆనవాళ్లున్నాయా?



ఇంధనం, గ్యాస్ నిక్షేపాలున్నాయా అంటూ ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచ్యురల్ గ్యాస్ కార్పొరేషన్) అన్వేషిస్తోంది. వాకాడు మండలం వాకాడు, గొల్లపాళెం గ్రామాల పొలాల్లో రెండు రోజులుగా యంత్రాలతో డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. ఆయిల్, గ్యాస్ నిక్షేపాల అన్వేషణలో భాగంగా ఈ పనులు చేపడుతున్నామని ఆ సంస్థ పీఆర్వో సుధీర్ తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి సూళ్లూరుపేట వరకు ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. ఆయిల్, గ్యాస్ నిక్షేపాల ఉనికి ఉందా లేదా అనేది తేల్చడానికి శాటిలైట్ విలేజ్‌ల ఆధారంగా డ్రిల్లింగ్ వేస్తున్నామన్నారు. 80 అడుగుల లోతులోని మట్టిని తీసి ఓఎన్‌జీసీ పరీక్షా కేంద్రానికి పంపిస్తామని, మరోవైపు అంత లోతునుంచి అయిస్కాంత తరంగాల ద్వారా ప్రత్యేక పరికరాలు భూగర్భంలోకిపంపి గ్యాస్ నిక్షేపాలు ఉన్నదీ లేనిదీపరిశీలిస్తున్నామన్నారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఆధ్యాత్మిక కేంద్రం. ఏడుకొండలపై కొలువైన శ్రీవారి దర్శనానికి నిత్యం లక్షకుపైగా వచ్చి పోయే భక్తులు. పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరుపతి.. ఇటీవల పలు కీలక కేసుల దర్యాప్తునకు కేంద్రంగా మారింది. సీఐడీ, సిట్ అధికారుల విచారణలు సాగిపోతున్నాయి. తాజాగా పరకామణిలో చోరీపై సీఐడీ దర్యాప్తు చేపట్టింది.

- తిరుపతి(నేర విభాగం), ఆంధ్రజ్యోతి



తిరుపతి కేంద్రంగా కీలక కేసులు

● తాజాగా 'పరకామణిలో చోరీ'పై మొదలైన సీఐడీ దర్యాప్తు

'మదనపల్లె ఫైల్స్' దహనం కేసు.. వైకుంఠ ఏకాదశి తొక్కిసలాటపై ఏక సభ్య కమిషన్.. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న కేసుపై సిట్ విచారణ.. బోగస్ ఎపిక్ కార్డులు, రాష్ట్రస్థాయిలో సంచలనం సృష్టించిన లిక్కర్ కేసు.. ఈ కీలక కేసుల దర్యాప్తు తిరుపతి కేంద్రంగానే జరుగుతోంది. ఇప్పుడు శ్రీవారి ఆలయంలో పరకామణి చోరీ కేసు సైతం ఇదే జాబితాలో చేరింది. అన్ని కేసుల్లోనూ రాష్ట్రస్థాయి పోలీసు అధికారులు తిరుపతిని కేంద్రంగా చేసుకొని విచారణపై విచారణలు చేస్తున్నారు. దీంతో తిరుపతికి సీఐడీ, వివిధ సిట్‌లకు సంబంధించిన అధికారుల రాకపోకలు ఎక్కువయ్యాయి. ఇక, అసెంబ్లీ ఎన్నికల సమయంలో పులివర్తి నానిపై జరిగిన దాడి కేసులోనూ ఎన్నికల కమిషన్ సిట్‌ను నియమించింది. ఈ కేసు ఇప్పటి వరకు ఏమైందో అర్థం కాని పరిస్థితి. ఇక, హైకోర్టు ఆదేశాలతో పరకామణి చోరీ కేసు దర్యాప్తు బుధవారం మొదలైంది. వైసీపీ హయాంలో బయటపడిన ఈ చోరీకి సంబంధించి.. నిందితుడి వద్ద ఆస్తులు స్వాధీనం చేసుకుని లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. ఇలా పరకామణిలో చోరీ కేసు నిందితుడు రవికుమార్‌పై నమోదైన క్రిమినల్ కేసును హడావుడిగా ఎందుకు మూసివేశారన్న విమర్శలు వచ్చాయి. పరకామణిలో 2023లో జరిగిన ఈ చోరీ, పూర్వాపరాలపై సీఐడీతో దర్యాప్తు చేయించాలని కోరుతూ జర్నలిస్టు ఎం శ్రీనివాసులు గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. పరకామణి ఉద్యోగి రవికుమార్ డాలర్ల రూపంలో భారీగా నగదు, బంగారం అపహరించారని, 2023 ఏప్రిల్ 29న చోరీ కేసు నమోదయ్యే నాటికి 38 ఏళ్లుగా రవికుమార్ అక్కడే పని చేస్తున్నారని గుర్తుచేశారు. దీనిపై విచారించిన హైకోర్టు.. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. ఇప్పటికే రికార్డులను స్వాధీనం చేసుకున్న సీఐడీ అధికారులు, కోర్టుకు సమర్పించారు. ఇక, బుధవారం నుంచి సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ గంగాధరం, లీగల్ కమిటీలో లక్ష్మణరావు ఇతర రాష్ట్రస్థాయి అధికారులు తిరుపతి కేంద్రంగా దర్యాప్తు ప్రారంభించారు. 20 మంది దర్యాప్తు అధికారులు తిరుపతిలో ఉండి.. 25 రోజుల పాటు దర్యాప్తు చేసి డిసెంబరు 2లోగా హైకోర్టుకు సీల్డ్ కవర్లో నివేదికను అందజేయనున్నారు. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కొక్కటిగా నమోదైన ఈ కీలక కేసుల్లోని నిందితుల్లో ఆందోళన మొదలైంది.

తెలిసింది చెప్పండి

శ్రీవారి పరకామణిలో చోరీ.. నిందితుడు రవికుమార్ అక్రమాలతో పాటు ఈ కేసులో ఏ సమాచారం తెలిసినా మాకు చెప్పండి. 94407 00921 ఫోను నెంబరు లేదా ఈమెయిల్‌కు (adgcid@ap.gov.in) సమాచారం ఇవ్వండి. మీ వివరాలు రహస్యంగా ఉంచుతాం.

- రవిశంకర్ అయ్యనార్, సీఐడీ డీజీ



రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

ఏసీబీ దాడులు

● ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగత సహాయకుడి బ్యాగులో డాక్యుమెంట్లు

రేణిగుంట నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ నేతృత్వంలో బుధవారం రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. కార్యాలయ స్వీపర్ నుంచి రూ.6500 స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ దాడుల సమయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు మురళీమోహన్ ఓ బ్యాగుతో బయటకు వెళ్లడాన్ని ఏసీబీ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. కార్యాలయ సమీపంలోని ఓ డాక్యుమెంట్ రైటర్ కార్యాలయంలో బ్యాగు పెట్టి వెళుతుండగా అతడిని పట్టుకుని విచారించారు. ఆ బ్యాగులో సూరప్పకశం, దామినేడు ప్రాంతాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, విజయవాడ ఫైల్, ఇటీవల సస్పెండైన అటెండర్ తిరుమలేష్‌కు సంబంధించిన ఫైలు ఉండడాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఆనంద్‌రెడ్డి గతంలో చేసిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలిస్తున్నారు. ఓ డాక్యుమెంట్ రైటర్ అసిస్టెంట్‌నూ విచారించారు. ఈ దాడులతో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలన్నీ మూతపడ్డయి.


ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగత సహాయకుడిని అదుపులోకి తీసుకొన్న ఏసీబీ అధికారులు

ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో

ఈవీ చార్జింగ్ స్టేషన్లు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల పక్కన చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని ఎస్ఈలను ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయం నుంచి బుధవారం ఆయన ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో 100 మంది చొప్పున విద్యుత్ ఉద్యోగుల గృహాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చి, వాటి పనితీరును అధ్యయనం చేయాలన్నారు. ఈ వ్యాలెట్ రీచార్జింగ్ ప్రక్రియ, ఎస్ఎంఎస్ అలర్ట్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్‌రావు, సీజీఎంలు జె.రమణాదేవి, ఎస్ఈలు పాల్గొన్నారు.


శివశంకర్

ఎస్వీయూ డిగ్రీ పరీక్షల

నోటిఫికేషన్ విడుదల

● ఫీజు చెల్లించేందుకు ఈనెల 14న చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షా ఫీజు చెల్లించేందుకు ఈ నెల 14వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. సంబంధిత కాలేజీలో విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

ఎస్సీ బాలుర హాస్టల్ వాచ్‌మాన్ అరెస్ట్

● వెల్ఫేర్ ఆఫీసర్ సస్పెన్షన్, ఒకరికి మెమో

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి చెన్నారెడ్డికాలనీలోని ఎస్సీ బాలుర వసతి హాస్టల్‌లో వాచ్‌మాన్ హరిగోపాల్ కొందరు విద్యార్థులను గదికి పిలిపించుకుని అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. బుధవారం అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. హరిగోపాల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. అలిపిరి పోలీసులు అయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మునిశంకర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై అభియోగాలు రూపొందించారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్యామసుందర్‌కు ఛార్జ్ మెమో ఇచ్చారు.

డిప్యూటీ సీఎం పర్యటనలో మార్పు

● 8న తిరుపతికి రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనలో స్వల్పమార్పులు జరిగింది. శుక్రవారం బదులు శనివారం ఆయన తిరుపతికి చేరుకుంటారు. మామండూరులో అటవీక్షేత్రాన్ని.. మధ్యాహ్నం 12.30 గంటలకు మంగళం వద్ద ఎర్రచందనం గోదామును పరిశీలిస్తారు. సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో అటవీ, పోలీస్, రెడ్‌శాండిల్ టాస్క్‌ఫోర్స్ అధికారుల కోఆర్డినేషన్ మీటింగ్‌లో పాల్గొని, తిరుగు ప్రయాణమవుతారు. చిత్తూరు జిల్లా పలమనేరు పర్యటన రద్దయింది.



శ్రీవారి సేవలో రాజు సుందరం

తమిళనటుడు, కొరియోగ్రాఫర్ రాజు సుందరం బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



మంత్రి లోకేశ్‌ను కలిసిన మిట్స్ విజయభాస్కర్

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను డీమ్డ్ టు బి మిట్స్ చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి కలిశారు.అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవల డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీగా అవకాశం రావడంతో చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి విజయవాడలో మంత్రిని కలిసి కళాశాలలో విద్యావిధానాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్శిటీలో అందిస్తున్న ఉన్నత విద్య, డిజిటల్ ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో తమ యూనివర్శిటీ సాధించిన పలు అంశాలు, నాణ్యమైన విద్య, అధ్యాపకుల మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు. దీంతో విజయభాస్కర చౌదరిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు.

వరదయ్యపాళెం ఎంపీపీ రాజీనామా ఆమోదం

వరదయ్యపాళెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీపీ పద్మప్రియ రాజీనామాను ఆమోదిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఆమె స్థానంలో బొప్పన పద్మావతిని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. పలు నాటకీయ పరిణామాల మధ్య ఎంపీపీ పదవికి పద్మప్రియ రాజీనామా చేశారు. దీంతో వైస్‌ఎంపీపీ పద్మావతి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,091

తలనీలాలు సమర్పించినవారు: 21,111





వెలుగుల స్వర్ణముఖి

శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కన స్వర్ణముఖి నదిలో భక్తులు నేతి దీపాలు వెలిగించి గంగాదేవికి సమర్పించారు. దీంతో స్వర్ణముఖినదీ తీరప్రాంతం ఎటు చూసినా నేతిదీపపు కాంతులతో ఆధ్యాత్మికను సంతరించుకుంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

యోగుల పర్వతంపై దీపోత్సవం



కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న ప్రతాప్‌స్వామి

వడమాలపేట మండలం బాలినాయుడుకండ్రిగ సమీపంలోని యోగుల పర్వతంపై బుధవారం దీపోత్సవం నిర్వహించారు. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు అడుగుల కొప్పెరలో 1502 కిలోల నెయ్యి ఏర్పాటు చేసిన దీపాన్ని సంస్థ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి వెలిగించారు. భక్తుల శివనామ స్మరణలతో యోగుల పర్వతం మార్మోగింది.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కపిలేశ్వరాలయానికి పోటెత్తారు



కపిలేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో బారులు తీరిన భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలోని శివాలయాలు రద్దీగా మారాయి. జలపాతాల వద్దా జనసందడి కనిపించింది. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. తిరుపతి నగరం కపిలేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రద్దీని ఊహించి టీటీడీ అధికారులు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు.

స్వామి, అమ్మవార్లకు అన్నాభిషేకం నిర్వహించారు. అన్నంతో రూపొందించిన ఉత్సవర్లను కపిలతీర్థంలో మునక వేయించారు. ఇక, సాయంత్రం ఆలయ సమీపంలోని ఉద్యానవనంలో భక్తులు కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగించారు.

- తిరుపతి (కల్చరల్), ఆంధ్రజ్యోతి





అన్నాభిషేకమూర్తులను పుష్కరిణిలో మునక వేయిస్తున్న అర్చకులు - కపిలేశ్వరాలయం పక్కన ఉద్యానవనంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీ

- సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని తొలగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు భద్రత నడుమ ఎస్వీయూలో విద్యార్థి సంఘాలు బుధవారం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించాయి. ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యవహారం చినికి చినికి గాలివానగా మారుతోంది. ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాలు నినదించాయి. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఆర్చి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి స్వయంగా తరగతిలో కూర్చొని సీనియర్ విద్యార్థులతో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయించాడని ఆరోపించారు. ఆయన్ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులకు చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీల కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు నరసన్న, వినోద్, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఆశ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, లా విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుందరరాజు, జీవీఎస్ నేత శివశంకర్ నాయక్, జేబీఎస్ఎఫ్ కన్వీనర్ భార్గవ్, పవిత్ర, అనిత, తిరుమలేష్, షేక్‌షా, మన్సూర్, చందు నాయక్, తిప్పేస్వామి, ఆదిత్య, అభిషేక్, ఇమ్రాన్ పాల్గొన్నారు.



ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన

సీసీ టీవీ ఫుటేజీలు చూపండి

- బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు

ర్యాగింగ్ వ్యవహారంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గొంతు విప్పారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ చూపించాలని కోరారు.

ముగిసిన విచారణ

సైకాలజీ విభాగంలో చోటు చేసుకున్న ర్యాగింగ్ వ్యవహారంపై ఏర్పాటు చేసిన కమిటీ విచారణ ప్రక్రియను పూర్తి చేసింది. యూనివర్సిటీ అధికారులకు నివేదికను సమర్పించింది. దాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలికి యూనివర్సిటీ అధికారులు పంపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశముంది.

కరుడు కట్టిన స్మగ్లర్ అరెస్టు

- కారు సహా ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కరుడు కట్టిన ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. రేంజ్ ఆఫీసర్ కథనం మేరకు.. తిరుపతి - అన్నమయ్య జిల్లా సరిహద్దు గ్రామం పింఛా నుంచి చెన్నైకు ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతుందని రహస్య సమాచారం ఉంది. దీంతో ఉస్తికాయలపెంటలో తమ సిబ్బంది నిఘా ఉంచారు. బుధవారం వేకువజామున పింఛా నుంచి ఎల్లమంద వైపు అతివేగంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా అతివేగంగా వెళుతూ ఎల్లమంద ఎస్సీ కాలనీ వద్ద కల్వర్టును ఢీకొని ఆగిపోయింది. ఈ క్రమంలో కారులో వున్న వ్యక్తిని పట్టుకొని, కారును పరిశీలించగా 114 కేజీల బరువున్న 5 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. నిందితుడిని విచారించగా 2022 ఫిబ్రవరి 6వతేదీన కేవీ పల్లె మండలంలో కారుతో గుద్దడంతో టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ గాయపడి చనిపోయిన కేసులో నిందితుడిగా తేలిందని ఎఫ్ఆర్వో వెంకట్రమణ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడుకు చెందిన రామన్ చిన్నయ్యన్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడిలో అధికారులు మునస్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, రాజేష్, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారన్నారు.

తిరుమలలో అస్వస్థతకు గురైన మహిళ మృతి



మృతి చెందిన మహిళ

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ఆదివారం అస్వస్థతకు గురైన ఓ మహిళ మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. 40 ఏళ్ల వయస్సు కలిగిన మంగ అనే మహిళ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రధాన కల్యాణకట్ట ముందున్న షెడ్‌లో మూర్ఛతో కుప్పకూలిపోయింది. 108 అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందినట్టు బుధవారం ఒక ప్రకటనలో పోలీసులు తెలిపారు. పేరు తప్ప ఆమె వివరాలేవీ తెలియదని పేర్కొన్నారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 94407 796768 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఎలక్ట్రీషియన్లకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇతర సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రీషియన్లకు జర్మనీలో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ లేదా డిప్లమో చేసి, 30ఏళ్ల లోపు వారు అర్హులని వెల్లడించారు. కనీసం రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉండాలని తెలిపారు. ఈ నెలలో రాజమండ్రిలో జర్మనీ భాషపై అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9160912690ను సంప్రదించాలని కోరారు.

ట్రేడింగ్ యాప్ పేరుతో రూ.1.50 కోట్లు కొట్టేశారు

తిరుపతి (నేరవిభాగం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ట్రేడింగ్ యాప్ పేరుతో రూ.1.50 కోట్లు కొట్టేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ సీఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని డీమార్ట్ సమీపంలో ఉంటున్న చైతన్య కుమార్, వెంకటేష్ కువైట్‌కు వెళ్లి కొంత డబ్బు సమకూర్చుకుని వచ్చారు. ఇక్కడ ఆన్‌లైన్ వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ ద్వారా ఒక గుర్తు తెలియని వ్యక్తితో వీరికి పరిచయమైంది. అంగారి ట్రేడ్ యాప్‌లో పెట్టుబడిపెడితే రెండింతలు లాభాలు వస్తాయని సదరు వ్యక్తి చెప్పి నమ్మించాడు. దీంతో వారు కోటి రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఎంతసేపు చూసినా డబ్బు అకౌంట్లో పడకపోవడంతో సదరు వ్యక్తికి ఫోన్ చేశారు. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని గుర్తించి తిరుపతి వెస్ట్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11, 12 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీస్ క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీస్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్, షటిల్, బాడ్మింటన్, చెస్, లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్‌టెన్నిస్, కబడ్డీ, క్యారం, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, క్రికెట్, వెయిట్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్‌ఫిజిక్స్, స్విమ్మింగ్, వాలీబాల్, యోగా, డ్యాన్స్, మ్యూజిక్ సంబంధించి పోటీలు ఎస్వీ తారకరామ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైనవారు ఈనెల 19నుంచి 22వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని, మరిన్ని వివరాలకు 9059606346, 9966882029లను సంప్రదించాలని కోరారు.

9 మంది స్మగ్లర్ల అరెస్టు

- 20 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి అటవీ పరిధిలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్ఎస్ఐ ఈశ్వరరెడ్డి బృందం శ్రీకాళహస్తి అటవీ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా బుధవారం తెల్లవారుజామున రాగిగుంట సెక్షన్, తీర్థాల పాలకోనలో కొంత మంది వ్యక్తులు గుమికూడి ఉండటాన్ని గమనించారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి తొమ్మిది మందిని పట్టుకున్నారు. పరిసర ప్రాంతాల్లో దాచి ఉంచిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో ఇద్దరు తిరుపతి జిల్లా, ఏడుగురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించి, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మీరూ రాష్ట్రానికి వచ్చి వైద్యసేవలు అందించండి

- లండన్‌లో స్విమ్స్ మాజీ వైద్యుడికి సీఎం చంద్రబాబు సూచన



సీఎం చంద్రబాబును కలిసిన డాక్టర్ కళ్యాణ్

తిరుపతి(వైద్యం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 'మీ తండ్రి గుడారు జగదీష్ గతంలో.. ఇప్పుడు బర్డ్ ఆస్పత్రిలో చక్కటి వైద్యసేవలను అందిస్తున్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని మీరు స్వదేశానికి వచ్చి మన రాష్ట్ర ప్రజలకు వైద్యసేవలు అందించండి. 'మీలాంటి అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు ఎంతో అవసరం' అంటూ లండన్‌లో స్థిరపడ్డ స్విమ్స్ మాజీ వైద్యుడు డాక్టర్ గుడారు కళ్యాణ్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. లండన్ పర్యటనకు వెళ్లిన సీఎం నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులను గతంలో స్విమ్స్‌లో పనిచేసిన వైద్యుడు, లండన్ కింగ్స్ అండ్ గయ్స్ హాస్పిటల్లోని కిడ్నీ వైద్య విభాగాధిపతి డాక్టర్ గుడారు కళ్యాణ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్‌లో అందిస్తున్న వైద్యసేవలు, అధునాతన వైద్యపద్ధతులను, అక్కడి కళ్యాణ్ అనుభవాల గురించి సీఎం చంద్రబాబునాయుడు అడిగి తెలుసుకున్నారు. లండన్‌లో అందుబాటులో ఉన్న రోబోటిక్ అధునాతన వైద్య పద్ధతులను ఆయన సీఎంకు వివరించారు.

సైన్స్ డ్రామాలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయి



రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

- డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సైన్స్ డ్రామాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం సౌజన్యంతో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్‌డ్రామా పోటీలు తిరుపతి పద్మావతి బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై అవగాహన పెంచుకుని సృజనాత్మకంగా ఆలోచించి పరిష్కారాలు తెలుసుకునేలా సైన్స్ డ్రామాలు విద్యార్థులను తీర్చిదిద్దుతాయని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. తిరుపతి ఎస్కేఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన మోక్షజ్ఞ బృందం ప్రదర్శించిన 'బెనిఫిట్ ఆఫ్ మ్యాన్ కైండ్' మొదటి బహుమతి, ఎస్టీఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన హారిక బృందం ప్రదర్శించిన 'స్మార్ట్ అగ్రికల్చర్' డ్రామా రెండవ బహుమతి గెలుచుకున్నాయి. ఇవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వీటితో పాటు ఎస్వీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన 'క్లీన్లీనెస్' తృతీయ, 'స్మార్ట్ అగ్రికల్చర్' ప్రదర్శన నాల్గవ స్థానాల్లో నిలిచి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాయి. ప్రథమ బహుమతికి రూ.1000, ద్వితీయకు రూ.750, తృతీయకు రూ.500, నాల్గవ బహుమతిగా రూ.250 నగదు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పద్మావతి బాలికల పాఠశాల హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ ఎక్స్‌పోలో కమిషనర్

తిరుపతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్పెయిన్‌లో జరుగుతున్న ప్రపంచ స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పోలో తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. స్పెయిన్‌లోని బార్సిలోనా పట్టణంలో ప్రపంచ స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్‌పోకు మౌర్యతోపాటు ఏపీ తరఫున రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, విశాఖపట్నం కమిషనర్ కేతన్ భార్గవ్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ ఎక్స్‌పో జరుగుతుంది.



ఉపాధ్యాయుల ఇంట్లో చోరీ

19 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

గూడూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిట్టపాళెం ప్రాంతంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుల ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 19 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు... మిట్టపాళెం ప్రాంతంలోని నివాసముంటున్న శారదమ్మ, మల్లికార్జున దంపతులు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారన్నారు. మంగళవారం ఉదయం వీరిద్దరూ ఇంటికి తాళాలు వేసుకుని పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంటి గేటుకు వేసివున్న తాళం మారిపోయి ఉండటాన్ని గమనించారు. లోనికి వెళ్లి చూడగా బీరువాను తెరిచి ఉంది. లాకర్‌లో ఉన్న సుమారు 19 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం పోలీసులు క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పులికాట్ సరస్సులో పక్షులకు శాశ్వత ఆశ్రయం హర్షణీయం: విజయశ్రీ

తడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సులో ఫ్లెమింగో పక్షులకు శాశ్వత ఆశ్రయం కల్పించడంతో పాటు అంతర్జాతీయ ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పులికాట్ సరస్సు వలస పక్షుల నిలయమని, ఏటా లక్షలాది పక్షులు ఇక్కడకు వచ్చి ఈప్రాంత జీవ వైవిధ్యానికి దోహదపడుతున్నాయని తెలిపారు. పులికాట్ సరస్సును పక్షులకు శాశ్వత ఆశ్రయంగా మార్చడం ఒక గొప్ప సంకల్పమని, ఎకో ఫ్రెండ్లీ టూరిజంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యకార కుటుంబాలకు, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని విజయశ్రీ అన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రాజావీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం జరిగింది. చైర్మన్‌గా శ్రీకంటి రామమోహన్‌రావు, సభ్యులుగా అమరయ్య నాయుడు, రవీంద్రబాబు, గోపాల్, శివరంజని, మంజులమ్మ, శ్రీరంగ, బాబు, సుజన ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.

దారి సౌకర్యం కల్పించాలని నిరసన



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నాంచారమ్మపేట గ్రామస్తుల నిరసన

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం ముత్యాలపాడు పంచాయతీ నాంచారమ్మపేట గ్రామంలో శ్మశానవాటికకు, పాఠశాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలంటూ ఎస్సీ కాలనీవాసులు బుధవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీ శ్మశానవాటిక దారిని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, శీనయ్య, అంకయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఉపకారవేతనం



విద్యార్థికి ఉపకార వేతనం అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేయూతనందిస్తున్నామని రోటరీక్లబ్ సభ్యులు చెప్పారు. బుధవారం స్థానిక రోటరీభవన్‌లో ఓ విద్యార్థికి ఉపకారవేతనం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న హశ్వంత్ ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రతిభ చాటడంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో చదలవాడ మురళీధర్ సహకారంతో విద్యార్థికి రూ. 20వేల ఉపకారవేతనాన్ని అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మునిగిరీష్, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, వెంకటేశ్వర్లురెడ్డి, పీవీకృష్ణయ్య, శ్రీధర్‌రెడ్డి, సురేష్, జీజీ నాయుడు, రాజేంద్రకుమార్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారుల ప్రతిభ

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన 28వ జాతీయ కరాటే పోటీలలో తిరుపతికి చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభచాటారు. 20 విభాగాల్లో 16 పతకాలు సాధించారు. బుధవారం ఉదయం వారు శాప్ చైర్మన్ ఎ.రవినాయుడిని కలవగా అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శిశిధర్ పాల్గొన్నారు.



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న శాప్ చైర్మన్



వెంకటగిరిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కోట: గూడలి సంగమేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కోట: స్వర్ణముఖినదిలో కార్తీక దీపాలను వదులుతున్న మహిళలు



గూడూరు, నాయుడుపేట శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సోమసుందేశ్వరస్వామి ఆలయం, సాయిబాబాగుడి తదితర ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు కార్తీకదీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయిబాబా ఆలయంలో శివలింగానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయం, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడు, మన్నారుపోలూరు సంతానేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు అభయ శంకరుడి, నాగేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఏఎంసీ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్లు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

తడ: చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో విశిష్ఠ పూజలు, గోపూజ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామికి పాలాభిషేకం చేశారు. అనంతరం శివలింగాన్ని వెన్నతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. వాటంబేడులో ఉన్న విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దీపార్చన జరిగింది. ఆలయం ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేకువజామునుంచే భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పిండిదీపాలను వెలిగించారు. స్వర్ణముఖినదిలో దీపాలను వదిలి మొక్కులు తీర్చుకున్నారు.

వాకాడు: మండలంలోని పంట్రాంగం శివాలయంలో ఉన్న పాండురంగేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూకట్టారు. అలాగే తూపిలిపాళెం సముద్రతీరంలో పూజలు నిర్వహించారు. మెరైన్ డీఎస్పీ బాలరాజు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో భద్రత కల్పించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి, రామలింగేశ్వర స్వామి, కర్ణకమ్మ వీధిలోని హరహరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో కార్తీక పూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

కోట: మండల పరిధిలోని గూడలి సంగమేశ్వర ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెగిలించారు. అలాగే స్వర్ణముఖినదిలోనూ దీపాలు వెలిగించారు. అదేవిధంగా శ్రీనివాససత్రం సముద్రంలో భక్తులు కార్తీక స్నానాలు చేశారు.

టీడీపీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయండి: పాశిం

చిట్టమూరు, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి అంకిత భావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం చిట్టమూరులోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన తాడిమేడు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లం వెంకటరత్నం మృతికి సంతాపం తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలసి పనిచేయాలని సూచించారు. గతంలో టీడీపీని కాపాడింది పాత క్యాడరేనని, వారిపై కొత్తగా పార్టీలో చేరిన వారు పెత్తనం చేస్తే సహించబోమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకుడు వాకాటి వేణురెడ్డి, మేరిగ మధుసూదన్ యాదవ్‌తో పాటు జక్కనివానిపల్లి, చిట్టమూరు, ఆలేటిపాడు, పేరింట్రామిట్టకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, శివకోటా రెడ్డి, చిన్నారావు, జనార్దన్ రెడ్డి, సునీల్ రెడ్డి, భారతమ్మ, హరికృష్ణా రెడ్డి, రాజేష్ రెడ్డి, గిరి నాయుడు, చెంచురామయ్య ఆచారి, బాబు నాయుడు, గోపాల్ నాయుడు, ఎస్ఆర్ఐ కృష్ణ, అనురాధాదేవి, ముత్తు, మంజులమ్మ, ఓమనరావు, అంకయ్య, బషీర్ పాల్గొన్నారు.

సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్న సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని వివేకానంద రోడ్డు, ముత్యాలపేట, పాతబస్టాండు తదితర ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, కోటేశ్వరరావు, చెంగయ్య, ప్రసాద్, చంద్రయ్య, రమణయ్య, మధు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఆంధ్రమహిళా మండలి సభ్యులు

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, స్వర్ణమ్మ, పరమేశ్వరమ్మ, మాధురి, లక్ష్మి, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

కోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోట బజారుసెంటర్‌లో బుధవారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి విచారణ చేపట్టారు. కోటకు చెందిన విష్ణునారాయణ తనను కులం పేరుతో దూషించారని నెల్లూరుకు చెందిన సరోజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సరోజనమ్మ మరికొందరితో కలిసి తన ఇంటిపై దాడి చేశారని విష్ణునారాయణ కూడా ఫిర్యాదు చేఆశారు. దీంతో బుధవారం డీఎస్పీ గీతాకుమారి విచారణ చేపట్టారు. ఆమె వెంట ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

తహసీల్దారుకు అభినందన

కోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సందర్భంగా విశేష సేవలు అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకున్న తహసీల్దారు జయజయరావును బహుజన ఐక్యవేదిక నాయకులు బుధవారం అభినందించారు. బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, సభ్యులు మదన్‌మిశ్ర, పాలా మల్లి, హేమంత్, వెంకటరమణయ్య, అశోక్, కేశవ, గోపీ, నాగేంద్ర తదితరులు శాలువాలు, పూలమాలలతో తహసీల్దారును అభినందించారు.

పాలచ్చూరులో వైసీపీ కోటి సంతకాల సేకరణ

పెళ్లకూరు, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని పాలచ్చూరు గ్రామంలో వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, నాయకులు కరణం రఘునాయుడు, మద్దాల కీర్తికిరణ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎల్లు మోహన్, ఇలుపూరు పాండురంగయ్య, మునిరాజ, సురేష్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు సమీపంలోని శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపడుతామని టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం ఆయన శ్మశానవాటికను పరిశీలించారు. చెన్నూరులోని రామలింగయ్య కాలనీ, జగనన్న కాలనీ, గిరిజన కాలనీలకు సంబంధించిన శ్మశానవాటికలో వసతులు సక్రమంగా లేవని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, సమస్యను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, అభిలాష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

10న ఓజిలి మండల సమావేశం

ఓజిలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



యాగం అనంతరం పూర్ణాహుతిని తీసుకెళ్తున్న ఉభయకర్త బాలచంద్రారెడ్డి దంపతులు

సూళ్లూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా చెంగాళమ్మ ఆలయంలో బుధవారం మహా చండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ యాగం జరిపారు. చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఉభయకర్తలకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బిహార్ ఎన్నిలకు షార్ నుంచి సీఐఎస్ఎఫ్ బలగాలు

సూళ్లూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో తొలివిడత అసెంబ్లీ ఎన్నికల బందోబస్తుకు షార్ నుంచి సీఐఎస్ఎఫ్ బలగాలు తరలివెళ్లాయి. షార్‌లో పనిచేసే రెండు కంపెనీలకు చెందిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది దాదాపు 200 మందికి పైగా బిహార్‌కు వెళ్లారు.

సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి నడుమ ఆర్డినరీ బస్సు నడపండి

సూళ్లూరుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి నడుమ ఆర్డినరీ బస్సు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. శ్రీకాహస్తి - సూళ్లూరుపేట నడుమ చాలా గ్రామాలు ఉన్నాయని, ఆర్డినరీ బస్సు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 4 గంటలపైన ఆర్డినరి బస్సు నడిపితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ప్రసాద్‌నాయుడు

పెళ్లకూరు, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌ను పెళ్లకూరు గ్రామానికి చెందిన నూతలపాటి ప్రసాద్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో రైతుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



యూరియా పంపిణీ

బాలాయపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవరం, బాలాయపల్లి సొసైటీల అధ్యక్షులు దాసరి ప్రభాకర్ నాయుడు, రాయి స్వతనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, నాయకులు దాసరి రాజగోపాల్ నాయుడు, రమేష్ నాయుడు, రాపూరు శ్రీనివాసులు, జయరామనాయుడు, రాయి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్... దొంగలు

రెండు రోజుల్లో 37 స్టార్టర్ల చోరీ

పెళ్లకూరు, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాగి వైర్లు, స్టార్టర్ల దొంగలు చెలరేగిపోతున్నారు. వరుస చోరీలతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. సోమవారం రాత్రి నెలబల్లి, భీమవరం గ్రామాల్లో సుమారు 30 స్టార్టర్లు, రాగి వైర్లు చోరీకి గురయ్యాయి. అదేవిధంగా మంగళవారం రాత్రి అక్కగారిపేట గ్రామంలోని రైతులు పేట సుధాకర్‌కు చెందిన 3, సాగి గురవయ్య 2, సునీల్ 1, బాబు 1 స్టార్టర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. రైతులు రబీలో వరి సాగుకు దుక్కులు సిద్ధం చేశారు. మరో పది రోజుల్లో వరి నాట్లు వేయాల్సి ఉండగా బావులు, బోర్ల వద్ద స్టార్టర్లు ఎత్తుకెళుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోట విద్యార్థులు

కోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఏవీకేఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 పోటీలు జరిగాయి. కోటలోని ఏవీకేఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పాకం గౌతమ్ డిస్క్‌త్రో అండర్-17 విభాగంలో ప్రతిభను కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే 8వ తరగతి తరగతి విద్యార్థిని భవ్యశ్రీ 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో మూడవస్థానం జిల్లాస్థాయిలో సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. వీరు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు వల్లీ అహ్మద్ తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ వల్లి

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు



పెన్నేపల్లి సమీపంలో స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): వాహనాల వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. బుధవారం పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి సమీపంలో 71వ జాతీయ రహదారిపై పోలీసులు స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిర్ణీత వేగం కంటే ఎక్కువ వెళ్తున్న వాహనాల నెంబరు ఆధారంగా జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రూరల్, టౌన్ సీఐలు సంగమేశ్వరరావు, బాబీ, ఎస్ఐలు పాల్గొన్నారు.

సముచిత పరిహారం ఇప్పించండి

పెళ్లకూరు, నవంబరు, 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి కోసం సేకరించిన తన భూమికి సముచిత పరిహారం ఇప్పించాలని రైతు భైనా చంద్రశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. మండలంలోని తాళ్వాయిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 80-16లో భైనా చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన 8 సెంట్ల భూమిలో మొదట జాతీయ రహదారి విస్తర్ణకు ఒక సెంటును అధికారులు తీసుకున్నారు. దానికి పరహారంగా రూ.19 వేలు చెల్లించారు. తదనంతరం మరో మూడు సెంట్లు సేకరించి రూ.58 వేలు పరిహారంగా చెల్లించేలా నిర్ణయించారు. తరువాత మిగిలిన 4 సెంట్లు కూడా సేకరించి రూ.12 లక్షల 17వేలు పరిహారం ప్రకటించారు. అప్పటికే భూముల రేట్లు విపరీతంగా పెరగడంతో ఆ నష్ట పరిహారం తనకు చాలదని, న్యాయబద్ధమైన పరిహారం ఇప్పించాలని కోరుతూ రైతు చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ప్రజాప్రయోజనాల దృష్ట్యా అక్కడ ఉన్న నిర్మాణాలను తొలగించాలని తహసీల్దార్ హరికృష్ణను ఆదేశించారు. ఆ మేరకు చంద్రశేఖర్‌రెడ్డి భూమిలో ఉన్న నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది బుధవారం తొలగించారు. బాధిత రైతు అక్కడకు చేరుకుని తనకు నష్టపరిహారం ఇవ్వకుండా నిర్మాణాలను తొలగించడం అన్యాయమని అభ్యంతరం చెప్పారు. పరిహారం పెంపు విషయమై కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

రెండు కార్ల ఢీ: ముగ్గురికి గాయాలు

తిరుపతి (నేరవిభాగం) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండుకార్లు ఢీకొని ముగ్గురు గాయపడిన ఘటన బుధవారం తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం వద్ద చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం అరియూరు గ్రామానికి చెందిన ఆర్.అభిషేక్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో శ్రీనివాస మంగాపురం వైపు వెళుతున్నారు. సీ మల్లవరం జంక్షన్ వద్ద బెంగళూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన రాజేంద్రన్, విఘ్నేష్, విష్ణు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తిరుపతి రుయాకు తరలించారు.